ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు

TGTEL/25/A1132

మానవాళికి

# జనంవార్త

ప్రతి అక్షరం.. జనం కోసం..

6 NEWS తెలుగు

మేడ్చల్ | సోమవారం | 21.09.2026 | సంపుటి : 2 | సంచిక : 79 | పేజీలు : 8 | వెల : 5/- | ఎడిటర్ : గడ్డమీది నాగరాజు పటేల్



## నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 107 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 134 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 208 (కిలో) |
| స్కిన్ లెస్ | 235 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹78

### విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్‌కు

## 'సర్' నోటీసులు

**ప్రస్తుత వివరాలను మ్యాపింగ్ చేయకపోవడంతోనే నోటీసులు జారీ చేసినట్లు ఈసీ వెల్లడి**

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20 : ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా పలువురు ప్రము-ఖులకు ఎన్నికల సంఘం నోటీసులిస్తోంది. ఇప్పటికే ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, ఆయన కుటుంబ సభ్యులకు నోటీసులివ్వడంపై

-మిగతా 2 లో..





## తెలంగాణలో అతి భారీ వర్షాలు

**23, 24, 25 తేదీల్లో కురిసే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ**

హైదరాబాద్, సెప్టెంబర్ 20 : బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడనం రానున్న రోజుల్లో తీవ్ర వాయుగుండంగా మారనున్న నేపథ్యంలో ఈ నెల 23, 24, 25 తేదీల్లో ఉత్తర తెలంగాణ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ పేర్కొంది. మంచిర్యాల, కరీంనగర్,

-మిగతా 2 లో..

## పాలమూరును ఎందుకు పూర్తిచేయలేదో చెప్పాలి

**కేసీఆర్‌కు మంత్రి కోమటిరెడ్డి ప్రశ్న**

మూడేళ్లలో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేస్తామని చెప్పిన మాజీ సీఎం కేసీఆర్.. ఎందుకు పూర్తి చేయలేదో చెప్పాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రశ్నించారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గంలో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి ఆయన పాల్గొన్నారు.



02



# ఎల్‌నినో ఎఫెక్ట్

## వేసవిని తలపిస్తున్న ఉష్ణోగ్రతలు

**సాధారణం కంటే 3 నుంచి 4 డిగ్రీల సెల్సియస్ అధికంగా నమోదు..**

అడపాదడపా వర్షాలు.. పగలు, రాత్రి ఉక్కపోత

రాష్ట్రంలో భిన్న వాతావరణం

తీవ్రమైన ఎల్‌నినో ప్రభావం

సెప్టెంబర్ ఉష్ణోగ్రత సెగలు కక్కుతోంది. సాధారణంగా ఉండాల్సిన చల్లదనం మాయమైంది. వేసవిని తలపించేలా పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3--4 డిగ్రీల సెల్సియస్ వరకు అధికంగా నమోదవుతున్నాయి. తీవ్రమైన ఎల్‌నినో, ఇతర భౌగోళిక పరిస్థితులు రాష్ట్రంపై ప్రభావం చూపిస్తున్నాయి. అడపాదడపా వర్షం.. ఆ వెంటనే తీవ్రమైన ఉక్కపోత. ఇదీ రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితి. గాలిలో తేమ శాతం అధికంగా ఉండటంతో పగటి ఉష్ణోగ్రతలు దాదాపు 40 డిగ్రీలను తాకుతున్నాయి.



## వాతావరణ మార్పుల ప్రభావాన్ని ఎదుర్కోవాలి

**అందుకు పక్కా విధానాలు, కార్యాచరణ ఉండాలని**

**రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము**

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20: వాతావరణ మార్పుల ప్రభావాన్ని ఎదుర్కోవాలంటే పక్కా విధానాలు, కార్యాచరణ ఉండాలని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు. ప్రభుత్వాలు, న్యాయనిపుణులు, ప్రభావిత వర్గాలు కలిసి పని చేస్తేనే సంక్లిష్ట సవాళ్లను సమర్థంగా ఎదుర్కోవటం సాధ్యమవుతుందని చెప్పారు. 'జాతీయ హరిత ట్రైబ్యునల్' (ఎన్జీటీ) ఆధ్వర్యంలో 'పర్యావరణం, వాతావరణ మార్పుల'పై జరిగిన రెండ్రోజుల అంతర్జాతీయ సదస్సు ముగింపును పురస్కరించుకుని ఆదివారం ఆమె ప్రసంగించారు. ఆహార భద్రత, ఆరోగ్యం, జీవనోపాధిపై వాతావరణ మార్పులు ఎంతో ప్రభావం చూపిస్తాయని చెప్పారు. "గ్రామీణులు, అడవుల్లో నివసించే తెగలు, సన్నకారు రైతులు, మహిళలు, ఇతర దుర్బల వర్గాలను చురుగ్గా భాగస్వాముల్ని చేసేలా కార్య వ్యవస్థ ఉండాలి. మానవ మనుగడలో

-మిగతా 2 లో..

## ఎర్రవల్లి భూములపై ఆందోళన వద్దు

**దళితుల హక్కులు కాపాడతామన్న పొంగులేటి**

దళితుల భూముల్లో అంగుళం కూడా తీసుకోం.. మంత్రి పొంగులేటి కీలక వ్యాఖ్యలు

దళితులు, గిరిజనుల భూముల జోలికి ప్రభుత్వం వెళ్లదని మంత్రి స్పష్టీకరణ

హైదరాబాద్, సెప్టెంబర్ 20: ఎర్రవల్లి భూముల వ్యవహారం నేపథ్యంలో దళిత రైతుల్లో నెలకొన్న ఆందోళనపై రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పందించారు. దళితులు, గిరిజనులకు చెందిన భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ఉద్దేశం లేదని ఆయన స్పష్టం చేశారు. భూ హక్కులను కాపాడటమే తమ ప్రభుత్వ విధానమని తెలిపారు. భూ రికార్డుల పరిశీలన, క్షేత్రస్థాయి సర్వేలు, హద్దుల నిర్ధారణ వంటి ప్రక్రియలను భూములు లాక్కునే చర్యలుగా భావించవద్దని పొంగులేటి పేర్కొన్నారు. యాజమాన్య హక్కులను స్పష్టీకరించడం,

-మిగతా 2 లో..





## బహుజనుల హక్కుల కోసం పోరాడతా

**'బహుజనుల బాణం' అంటూ కవిత కొత్త నినాదం..**

మోదీ, రేవంత్, కేసీఆర్‌పై పోరాటానికి సిద్ధమని ప్రకటన

కొడంగల్‌లోని పాంచజన్య సంకల్ప సభలో రాజకీయ వైఖరిపై కవిత స్పష్టీకరణ

విద్య, మహిళల ప్రాతినిధ్యంపై ప్రభుత్వాలపై ప్రశ్నల వర్షం

కొడంగల్, సెప్టెంబర్ 20: తన రాజకీయ ప్రయాణానికి ఎవరో ఒకరు అండగా నిలిచారన్న ప్రచారాన్ని కల్వకుంట్ల కవిత తోసిపుచ్చారు. దశాబ్దాలుగా అధికార వ్యవస్థకు, విద్యా అవకాశాలకు దూరంగా ఉన్న బహుజన వర్గాల తరఫున తాను గళం వినిపిస్తున్నానని చెప్పారు. ఆదివారం కొడంగల్‌లో నిర్వహించిన 'పాంచజన్య సంకల్ప సభ'లో ఆమె తన రాజకీయ దిశను వివరించారు. తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో జరిగిన ఈ సభలో సామాజిక న్యాయం, యువత,

-మిగతా 2 లో..

## ఖైరతాబాద్ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌కు షాక్ తప్పదు

**కాంగ్రెస్‌కు ఎన్నికను ఎదుర్కొనే సత్తా లేదు**

.. కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు

దానం నాగేందర్ వినాయకుడితో తనను పోల్చుకోవడంపై బండి సంజయ్ వ్యంగ్యం

ఫామ్‌హౌస్‌ల సందర్శనపై కాంగ్రెస్‌ను టార్గెట్ చేసిన బండి సంజయ్

ప్రైవేటు భూముల్లోకి వెళ్లే అధికారం మీకెక్కడిది?: కాంగ్రెస్‌పై బండి సంజయ్



కరీంనగర్, సెప్టెంబర్ 20: ఖైరతాబాద్ అసెంబ్లీ ఉప ఎన్నికను ప్రస్తావిస్తూ కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు చేశారు. ఈ ఎన్నికలో కాంగ్రెస్ ఓటమి పాలవడం ఖాయమంటూ ఆయన వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ తమకు ప్రత్యర్థే కాదని, ఉప ఎన్నికను సమర్థంగా ఎదుర్కొనే స్థితిలో ఆ పార్టీ లేదని అన్నారు. ఆదివారం కరీంనగర్‌లో పలు కార్యక్రమాలకు హాజరైన బండి సంజయ్ అనంతరం మీడియాతో మాట్లాడారు. దానం నాగేందర్

-మిగతా 2 లో..

# ఖైరతాబాద్ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌కు షాక్ తప్పదు

(మొదటిపేజీ తరువాయి)



ఇటీవల తనను వినాయకుడితో పోల్చుకోవడాన్ని ఆయన తప్పుబట్టారు. వినాయకుడి నిమజ్జనం చివర్లో జరుగుతుందనే విషయం దానం నాగేందర్‌కు తెలియదా అని ప్రశ్నించారు. అదే సమయంలో దానం నాగేందర్ దీర్ఘాయుష్షుతో జీవించాలని ఆకాంక్షించారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ తమకు ఎలాంటి పోటీ ఇవ్వలేదని బండి సంజయ్ పేర్కొన్నారు. ఎన్నికను ఎదుర్కొనే సామర్థ్యం ఆ పార్టీకి లేదని అన్నారు. కాంగ్రెస్ నాయకులు చేపడుతున్న ఫామ్‌హౌస్ పర్యటనలపైనా ఆయన వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కేసీఆర్ కుటుంబానికి చెందిన ఫామ్‌హౌస్‌లు ఏమైనా పర్యాటక ప్రాంతాలా అంటూ బండి సంజయ్ ప్రశ్నించారు. ఇతరుల వ్యక్తిగత భూముల్లోకి వెళ్లి పరిశీలనలు చేయడానికి కాంగ్రెస్ నాయకులకు ఏ హక్కు ఉందని నిలదీశారు. ప్రైవేటు స్థలాల విషయంలో కాంగ్రెస్ నేతలు వ్యవహరిస్తున్న తీరుపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు.





# బహుజనుల హక్కుల కోసం పోరాడతా

(మొదటిపేజీ తరువాయి)

మహిళల అంశాలను ప్రస్తావించారు. సభా వేదికపై కవిత మాట్లాడు తూ తనను కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలకు అనుకూలంగా ఎవరో పంపించారన్న ప్రచారాలను ప్రస్తావించారు. తాను ఏ పార్టీకి చెందిన వ్యక్తి వదిలిన రాజకీయ ఆయుధం కాదని, బహుజనులు, యువత తరఫున పోరాడే వ్యక్తినని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ ఎవరైనా సరే.. యువత, బహుజనుల హక్కుల విషయంలో ప్రశ్నించేందుకు వెనుకాడబోనని ప్రకటించారు. ఎలాంటి రాజకీయ కుటుంబ లేదా ఇతర మద్దతు లేకుండానే ఒక మహిళ తన సొంత రాజకీయ ప్రస్థానాన్ని నిర్మించగలదనే విషయాన్ని నిరూపించాలనే ఉద్దేశంతో ముందుకు వచ్చినట్లు కవిత తెలిపారు. ప్రజలు తనకు ధైర్యం ఇవ్వాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై కూడా ఆమె విమర్శలు చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని గట్టు, కేటీ దొడ్డి మండలాల్లో అక్షరాస్యత పరిస్థితిపై ఆమె ప్రశ్నలు లేవనెత్తారు. అఫ్గానిస్తాన్‌తో సమానంగా ఉందని పేర్కొంటూ, గతంలో విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన సమయంలో ఈ పరిస్థితిని ఎందుకు మార్చలేకపోయారని రేవంత్‌రెడ్డి ని ప్రశ్నించారు. మహిళల సామాజిక, రాజకీయ స్థితిగతులపైనా కవిత మాట్లాడారు. దేశవ్యాప్తంగా మహిళలను గొప్పగా ప్రస్తావిస్తున్నప్పటికీ కుటుంబ వ్యవస్థలోనూ, రాజకీయ వ్యవస్థలోనూ వారికి తగిన స్థానం దక్కడం లేదని ఆమె వ్యాఖ్యానించారు. దేశంలోని 29 రాష్ట్రాల్లో ఒక్క రాష్ట్రానికే మహిళ ముఖ్యమంత్రిగా ఉన్నారని గుర్తుచేశారు. బహుజను లు, మహిళలు, యువతకు రాజకీయ అవకాశాలు పెరగాలన్నదే తన పోరాటంలో ప్రధాన అంశమని కవిత పేర్కొన్నారు. వారి హక్కులు, ఆత్మగౌరవం, రాజకీయ భాగస్వామ్యం కోసం తన కార్యక్రమాలను కొనసాగిస్తానని తెలిపారు.



# ఎర్రవల్లి భూములపై ఆందోళన వద్దు

(మొదటిపేజీ తరువాయి)

పాత వివాదాలను పరిష్కరించడం, అర్హులైన భూ యజమానులకు రక్షణ కల్పించడమే ఈ ప్రక్రియ ఉద్దేశమని వివరించారు. ఎర్రవల్లి పరిణామాల నేపథ్యంలో ప్రస్తుతం సర్వే నంబర్ 325కు సంబంధించిన భూములపై రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహిస్తున్నారు. 388.05 ఎకరాల విస్తీర్ణానికి సంబంధించి రికార్డుల్లో నమోదైన రైతులకు అధికారులు నోటీసులు జారీ చేసి, తమ వద్ద ఉన్న భూ హక్కు పత్రాలతో హాజరుకావాలని సూచించారు. ఈ వ్యవహారం మాజీ సీఎం కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్ చుట్టూ ఉన్న భూములపై అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటనల తర్వాత తెరపైకి వచ్చింది. ఫామ్‌హౌస్ పరిసరాల్లో సుమారు 700 ఎకరాల భూమి, అందులో 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని సీఎం ఆరోపించగా, దీనిపై రెవెన్యూ శాఖ స్థాయిలో పరిశీలన కొనసాగుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వాలు భూ సంస్కరణలు, భూ పంపిణీ ద్వారా పేదలకు హక్కులు కల్పించాయని పొంగులేటి తెలిపారు. తెలంగాణలో దళితులకు సుమారు 25 లక్షల ఎకరాలు, గిరిజనులకు 2 లక్షల ఎకరాల పోడు భూములు పంపిణీ చేసిన ఘనత కాంగ్రెస్‌దేనని ఆయన పేర్కొన్నారు. గతంలో దళితులకు మూడెకరాల భూమి ఇస్తామని చెప్పిన కేసీఆర్ హామీని ప్రస్తావిస్తూ ఆయన విమర్శలు చేశారు. భూముల విషయంలో కొందరు కావాలనే అపోహలు సృష్టిస్తూ దళితులను భయపెడుతున్నారని పొంగులేటి ఆరోపించారు. వాస్తవాలను పరిశీలించిన తర్వాతే స్పందించాలని సూచించారు. ప్రభుత్వ భూ సంబంధిత చర్యలు చట్టపరమైన విధానాల ప్రకారమే, పారదర్శకంగా సాగుతాయని ఆయన స్పష్టం చేశారు.



# వేసవిని తలపిస్తున్న ఉష్ణోగ్రతలు

- సాధారణం కంటే 3 నుంచి 4 డిగ్రీల సెల్సియస్ అధికంగా నమోదు..
- అడపాదడపా వర్షాలు.. పగలు, రాత్రి ఉక్కపోత
- రాష్ట్రంలో భిన్న వాతావరణం
- తీవ్రమైన ఎల్‌నినో ప్రభావం

**హైదరాబాద్, సెప్టెంబర్ 20 :** ఎల్‌నినో ప్రభావం వల్ల నైరుతి రుతుపవనాలు బలహీనపడటం, మేఘాలు లేకపోవడంతో ఆగస్టు, సెప్టెంబర్ తొలిభాగంలో సుదీర్ఘ పొడి వాతావరణం ఏర్పడింది. ఆకాశం నిర్మలంగా ఉండటం వల్ల పగటిపూట సౌర వికిరణం (సోలార్ రేడియేషన్) నేరుగా భూమిని తాకుతోంది, తద్వారా పగటి ఉష్ణోగ్రతలు 33 డిగ్రీల సెల్సియస్ నుంచి 37 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదవుతూ కొన్ని ప్రాంతాల్లో 40 డిగ్రీలకు కూడా చేరువవుతున్నాయి. తీవ్రమైన ఉక్కపోత (హై హ్యూమిడిటీ ట్రాప్) కొనసాగుతోంది. తెలంగాణ మీదుగా వీస్తున్న గాలుల్లో తేమ శాతం 70 శాతానికి పైగా ఉంటోంది. గాలిలో తేమ ఎక్కువగా ఉండి, మేఘాలు లేనప్పుడు భూమి విడుదల చేసే వేడి అంతరిక్షంలోకి వెళ్లకుండా వాతావరణంలోనే బందీ అవుతోంది. దీనివల్ల రాత్రి వేళల్లో కూడా ఉష్ణోగ్రతలు తగ్గడం లేదు. ప్రస్తుతం రాత్రి వేళల్లో 20--22 డిగ్రీల సెల్సియస్ ఉండాల్సిన ఉష్ణోగ్రతలు, 24--27 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదవుతున్నాయి. పసిఫిక్ మహాసముద్ర ఉపరితల జలాలు అసాధారణంగా వేడెక్కడాన్ని ఎల్‌నినో అంటారు. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) నివేదికల ప్రకారం.. ప్రస్తుతం భూమధ్యరేఖ పసిఫిక్ ప్రాంతంలో మధ్యస్థ నుండి తీవ్రమైన ఎల్‌నినో పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఎల్‌నినో తీవ్రత వల్ల భారత ఉపఖండంపై రుతుపవన ద్రోణి బలహీనపడింది. ఫలితంగా, బంగాళాఖాతంలో ఏర్పడాల్సిన అల్పపీడనాల సంఖ్య తగ్గింది. దీనివల్ల తెలంగాణకు అందాల్సిన స్థిరమైన వర్షాలు ఆగిపోయాయి. ఎల్‌నినో కారణంగా రాష్ట్రంలో ఆగస్టు మాసంలో సాధారణం కంటే దాదాపు 38--64% తక్కువ వర్షపాతం నమోదైంది. సెప్టెంబర్ 17 నాటికి కూడా రాష్ట్రంలో సగటు వర్షపాత లోటు తీవ్రంగా కొనసాగుతోంది వాతావరణ విచ్ఛిన్నత.. ఎల్‌నినో ప్రభావం వల్ల రుతుపవన వాతావరణం దెబ్బతింది. నిరంతరంగా కురిసే ముసురు వానలకు బదులుగా, సుదీర్ఘమైన కరవు పరిస్థితులు (డ్రై స్పెల్), ఆకస్మికంగా పిడుగులతో కూడిన వర్షాలు కురిసే విచిత్ర వాతావరణం ఏర్పడింది.



# తెలంగాణలో అతి భారీ వర్షాలు

(మొదటిపేజీ తరువాయి)

పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల్లో అక్కడక్కడ 10 సెం.మీ.పైన వర్షాలు కురిసే అవకాశాలున్నాయంటూ ఈ జిల్లాలకు 'ఆరెంజ్' రంగు హెచ్చరికలు.. మిగిలిన జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని 'పసుపు' రంగు హెచ్చరికలు జారీ చేసింది. సోమ, మంగళవారాల్లో ఉత్తర, దక్షిణ జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని సూచించింది. తూర్పు మధ్య బంగాళాఖాతంలో శనివారం ఏర్పడిన అల్పపీడనం 22వ తేదీ నాటికి తీవ్ర వాయుగుండంగా మారనుంది. పశ్చిమ-వాయవ్య దిశలో ప్రయాణిస్తూ 23వ తేదీ ఉదయం నాటికి ఉత్తర ఆంధ్రప్రదేశ్-దక్షిణ ఒడిశా తీరాల సమీపానికి చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. శనివారం నుంచి ఆదివారం ఉదయం వరకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో 13.7 సెం.మీ నమోదైంది. ఇదే జిల్లా పెద్ద కొత్తపల్లి మండలం చెన్నపురావుపల్లిలో 9.9, కోడేరు మండలంలో 8.4 సెం.మీ కురిసింది. సంగారెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం, సిద్దిపేట, రంగారెడ్డి, జగిత్యాల, నారాయణపేట, వనపర్తి, ములుగు, ఖమ్మం జిల్లాల్లో పలుచోట్ల ఓమోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. కాగా, కరీంనగర్‌లో ఆదివారం మధ్యాహ్నం అరగంట పాటు వర్షం దంచికొట్టింది.



# విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్‌కు 'సర్' నోటీసులు

(మొదటిపేజీ తరువాయి)

ప్రతిపక్షాల నుంచి తీవ్ర దుమారం రేగిన సంగతి తెలిసిందే. తాజాగా విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్‌తోపాటు ఆయన భార్య క్యోకో జైశంకర్‌కు ఈసీ నోటీసులు జారీ చేసింది. 'అన్‌మ్యాప్డ్ విత్ లాస్ట్ ఎస్ఐఆర్' కింద ఈ నోటీసులు జారీ అయ్యాయి. వారి ప్రస్తుత వివరాలను ఎస్ఐఆర్-2002 వివరాలతో మ్యాపింగ్ చేయకపోవడంతోనే నోటీసులు జారీ చేసినట్లు ఈసీ వెల్లడించింది. జైశంకర్, ఆయన భార్యకు న్యూఢిల్లీ అసెంబ్లీ పరిధిలోని సుందర్‌బాగ్‌లో ఓటు హక్కు ఉంది. మరోవైపు సీపీఎం ఎంపీ జాన్ బ్రిట్టాస్ భార్య షెబా బ్రిట్టాస్, కుమారుడు ఆనంద్‌కు కూడా 'సర్' నోటీసులు అందాయి. గత రికార్డులతో షెబా పేరు సరిపోలకపోవడంతో ఆమెకు, ఆనంద్‌కు నోటీసులు జారీ అయ్యాయి. ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, ఆయన భార్య సునీతా ద్వివేదికి కూడా 'అన్‌మ్యాప్డ్ విత్ లాస్ట్ ఎస్ఐఆర్' కింద నోటీసులిచ్చినట్లు తెలుస్తోంది.

# ఆదిలాబాద్ విమానాశ్రయ పనులకు నోడల్ అధికారులు

## కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్:** ఆదిలాబాద్‌లో విమానాశ్రయానికి సంబంధించి జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ పనులను వేగవంతం చేయడానికి కేంద్రం నోడల్ అధికారులను నియమించినట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ఈ వివరాలను 'ఎక్స్' వేదికగా ఆదివారం వెల్లడించారు. "రాష్ట్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని పనులను ముందుకు తీసుకెళ్లడానికి రక్షణ, పౌరవిమానయాన మంత్రిత్వశాఖల నుంచి నోడల్ అధికారుల నియామకం జరిగింది. రక్షణ మంత్రిత్వశాఖ పలు మౌలిక వసతులను ఇక్కడ నిర్మించనుంది. సివిల్ టెర్మినల్ తదితర సదుపాయాలను ఎయిర్‌పోర్ట్సు అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ) ఏర్పాటు చేయనుంది. ఈ ప్రాజెక్టు పనులు వేగవంతం చేయడానికి రాష్ట్రప్రభుత్వం నుంచి కూడా నోడల్ అధికారిని నియమించాలి" అని కిషన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# పాలమూరును ఎందుకు పూర్తిచేయలేదో చెప్పాలి



## కేసీఆర్‌కు మంత్రి కోమటిరెడ్డి ప్రశ్న

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 20 :** మూడేళ్లలో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేస్తామని చెప్పిన మాజీ సీఎం కేసీఆర్.. ఎందుకు పూర్తి చేయలేదో చెప్పాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రశ్నించారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గంలో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి ఆయన పాల్గొన్నారు. అనంతరం వనపర్తి జిల్లా మదనాపురంలో నిర్వహించిన సభలో వెంకట్‌రెడ్డి మాట్లాడారు. కరివెన వద్ద కుర్చీ వేసుకొని ప్రాజెక్టును పూర్తిచేస్తామని చెప్పి.. కమీషన్ల కోసం కాళేశ్వరం వెంట పరిగెత్తారని ఆరోపించారు. ప్రజల మధ్య ఉండి వారి కోసం పనిచేసి తాను ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచానని, కేటీఆర్ మాత్రం తన తండ్రి కేసీఆర్ పేరు చెప్పుకొని ఎమ్మెల్యే అయ్యారని ఎద్దేవా చేశారు. జిల్లాలో రహదారుల అభివృద్ధికి రూ.1,600 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఎల్‌నినో ప్రభావంతో కరవు వచ్చిందని, జూరాల ప్రాజెక్టు రైతులు ఆందోళన చెందొద్దని, సాగునీటిని పొదుపుగా వాడుకోవాలని మంత్రి వాకిటి శ్రీహరి కోరారు. తాగునీటి అవసరాల దృష్ట్యా నీటి నిల్వలు అందుబాటులో ఉంచుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం కురుమూర్తి ఆలయం వద్ద ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులను ఆర్అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డి, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. గత భారాస ప్రభుత్వం పాలమూరు-రంగారెడ్డి పథకాన్ని నిర్లక్ష్యం చేసిందని, ఇప్పుడా నాయకులు రైతుల కోసం మొసలికన్నీరు కారుస్తున్నారని విమర్శించారు.



# వాతావరణ మార్పుల ప్రభావాన్ని ఎదుర్కోవాలి

(మొదటిపేజీ తరువాయి)

వేర్వేరు స్థాయుల్లో అసమతౌల్యాలకు వాతావరణ మార్పులు కారణమవుతాయి. జీవ వైవిధ్యాన్ని కోల్పోవడం, జల వనరుల క్షీణత, అడవుల క్షీణత వంటివన్నీ దీనితో ముడిపడినవే. మన సంప్రదాయ పద్ధతులు, స్థానిక తెగల అనుభవాలు ఉపయోగించుకుని వాతావరణ మార్పులకు కొంతమేర కళ్లెం వేయవచ్చు. వాటిని బలోపేతం చేసేలా ప్రజలు కేంద్రంగా ముందుకు వెళ్లాలి. అడవుల విస్తీర్ణాన్ని పెంచడం దీనిలో కీలకం. తద్వారా జీవ వైవిధ్యం సాధ్యమవుతుంది. అడవుల పెంపకం అంటే మొక్కలు నాటడం ఒక్కటే కాదు.. ఆరోగ్యకర, సుస్థిర పర్యావరణ వ్యవస్థను పునరుద్ధరించడం" అని ముర్ము చెప్పారు. "నా చిన్నతనంలో మా నాన్న ప్రతిరోజూ సమీప అటవీ ప్రాంతానికి వెళ్లి కట్టెలు తెచ్చేవారు. ఎండిన చెట్టును నరకాల్సి వచ్చినా ముందుగా దానికి వినమ్రంగా క్షమాపణ చెప్పేవారు. అలా ఎందుకు చేస్తారని నేనోసారి అడిగారు. పండ్లు, పూలు, గాలి, నీరు వంటివి ఇచ్చిన చెట్టులో భాగమే ఆ కర్రలు అని, కాలంచెల్లి ఎండిపోయినా అవి మనకు ఉపయోగపడుతున్నాయని ఆయన చెప్పారు. భూమిని దున్నేటప్పుడూ ఆయన భూమాతకు ప్రణమిల్లేవారు. భూమివల్లే మనం ఏ ఉత్పత్తులనైనా పొందుతున్నామని చెప్పేవారు. బతుకు.. బతకనివ్వు అనే దానిపై మాకెంతో నమ్మకం" అని ముర్ము వివరించారు. ఇలాంటి వినమ్రత మన సంస్కృతిలోనే ఉందని చెప్పారు.

# శాస్త్రీయ దృక్పథానికి ప్రతీక డాక్టర్ ఏ.ఎస్.రావు

- జెవివి రాష్ట్ర కోశాధికారి పి.నాగరాజు.
- జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జయంతి వేడుకలు

**నాగారం, సెప్టెంబర్ 20 (జనం వార్త) :** ప్రముఖ శాస్త్రవేత్త,ఈసీఐఎల్ వ్యవస్థాపకుల్లో ఒకరైన డాక్టర్ ఏ.ఎస్.రావు శాస్త్రీయ ఆలోచనలకు, సాంకేతిక స్వావలంబనకు ప్రతీకగా నిలిచారని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కోశాధికారి పి.నాగరాజు పేర్కొన్నారు. జన విజ్ఞాన వేదిక కీసర మండల కమిటీ ప్రథమ సమావేశం రాంపల్లి చౌరస్తాలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ ఏ.ఎస్.రావు జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కోశాధికారి పి.నాగరాజు మాట్లాడుతూ దేశ ఎలక్ట్రానిక్స్ రంగ అభివృద్ధికి డాక్టర్ ఏ.ఎస్.రావు అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. భారత అణుశక్తి,ఎలక్ట్రానిక్స్ పరిశోధన రంగాల్లో ఆయన కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. ఈసీఐఎల్ స్థాపన ద్వారా దేశ సాంకేతిక స్వావలంబనకు బలమైన పునాదులు వేసిన మహనీయుడిగా ఆయన చరిత్రలో నిలిచిపోయారన్నారు. నేటి యువత శాస్త్రీయ దృక్పథాన్ని అలవరుచుకోవాలని, మూఢనమ్మకాల నిర్మూలనకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పరిశోధనాత్మక ఆలోచనలు, విజ్ఞాన శాస్త్రంపై ఆసక్తి పెంపొందించుకోవడం ద్వారా సమాజాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. డాక్టర్ ఏ.ఎస్.రావు ఆశయాలను భావితరాలు ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశానికి కీసర మండల కమిటీ అధ్యక్షుడు నవీన్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో జన విజ్ఞాన వేదిక కీసర మండల కమిటీ ప్రధాన కార్యదర్శి శేషగిరిరావు,సభ్యులు నర్సింహా,కృష్ణ,సతీష్ తదితరులు పాల్గొన్నారు.



## అబ్బ కరుణాకర్ ముదిరాజ్‌కు అభినందనలు



**నాగర్ కర్నూల్ సెప్టెంబర్ 20(జనం వార్త) :** నాగర్ కర్నూల్ జిల్లా జర్నలిస్టుల జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షులుగా జనం వార్త స్టాఫ్ రిపోర్టర్ అబ్బ కరుణాకర్ ఎన్నిక య్యారు. జర్నలిస్ట్ ల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం, భద్రత కోసం నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షిస్తున్నాం. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకు రావడంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలక మైనదని, అదే సమయంలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. టిజె జెఎసి నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడిగా అబ్బ కరుణాకర్ ముదిరాజ్ గారి నాయకత్వంలో జర్నలిస్టుల ఐక్యత మరింత బలోపేతం కావాలని, జర్నలిస్టుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టాలని కోరుకుంటూ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాం.



## వెంకట సాయి హోమ్స్‌లో రూ.3.20 లక్షలు పలికిన వినాయకుడి లడ్డు

### లడ్డూను దక్కించుకున్న కాకర్ల కుటుంబం

**కూకట్‌పల్లి, సెప్టెంబర్ 20, (జనం వార్త) :** నిజాంపేట్‌లోని వెంకట సాయి హోమ్స్ లో వినాయక ఉత్సవాల సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు నిర్వహించిన గణేశుడి లడ్డూ వేలంలో ఈ ఏడాది లడ్డూ రూ. 3, లక్షల 20 వేలు పలికింది. వెంకట సాయి హోమ్స్ లో విల్లా నెంబర్ 43 కు చెందిన కాకర్ల సాంబశివరావు, కాకర్ల శారద దంపతులు ఈ లడ్డూను దక్కించుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కమిటీ సభ్యులు వినాయక లడ్డూ వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో వినాయక లడ్డూను కాకర్ల సాంబశివరావు కుటుంబం సొంతం చేసుకుంది. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు రాంప్రసాద్, సభ్యులు ధర్మారావు, కోటపాటి రమేష్, మూర్తి, హనుమంత్ రెడ్డి, శ్రీకాంత్, దుర్గా ప్రసాద్, పవన్ మాధవ్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, గుంటుపల్లి వంశీకృష్ణ, రావిపాటి గిరి. కాలనీవాసులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్ఆర్పీఎస్, ఎమ్ఎస్పీ మండల అధ్యక్షులుగా జగపతి అంజయ్య మాదిగ

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 20, (జనం వార్త) :** మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్ఆర్పీఎస్) ఎమ్ఎస్పీ వ్యవస్థాపకులు మందా కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు శేరిలింగంపల్లి మండల నూతన కార్యవర్గ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జ్ రావుగళ్ళ బాబు మాదిగ నూతన కమిటీని ప్రకటించారు. ఎమ్ఆర్పీఎస్ఎమ్ఆర్పీఎస్, ఎమ్ఎస్పీ మండల అధ్యక్షులుగా జగపతి అంజయ్య, అధికార ప్రతినిధిగా సాంసంగ్ మాదిగ, ఎమ్ఎస్పీ మండల అధ్యక్షులుగా సుదర్శన్ మాదిగ,ఎమ్ఎస్పీ అధికార ప్రతినిధిగా సింగారం దాసరి రాజు మాదిగ నియామకాలు జరిగాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ ఆశీస్సులతో, రాజ్యాధికార సూచన మేరకు ఎమ్ఆర్పీఎస్ , ఎమ్ఎస్పీ శేరిలింగంపల్లి మండల కార్యక్రమాలను బలోపేతం చేస్తామని, మాదిగ రిజర్వేషన్ పోరాటాన్ని ముందుకు తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐత రమేష్ మాదిగ, సింగ దాసరి, నరేష్ మాదిగ, రాజేష్ మాదిగ, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## నవరాత్రి ఉత్సవాలలో కుంకుమ పూజ

### భక్తిశ్రద్ధలతో పాల్గొన్న మహిళ భక్తులు

**కూకట్‌పల్లి, సెప్టెంబర్ 20, (జనం వార్త) :** వినాయక నవ రాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని కూకట్ పల్లి మాధవరం నగర్ కాలనీ ఏ బ్లాక్ లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక కుంకుమ పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ప్రత్యేక కుంకుమ పూజ కార్యక్రమానికి స్థానిక మహిళా భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ప్రతిరోజు స్వామి వారికి ప్రత్యేక పూజలలో భాగంగా పలు పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ సెక్రటరీహెచ్. శ్రీనివాస్, బి.శ్రీనివాస్, వెంకటరెడ్డి,వీర్రాజు, రాజేందర్ కాలనీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గురుకులాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే వంశీకృష్ణ

**నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 20 (జనం వార్త):** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని శ్రీపురం రోడ్డులో ఉన్న మహాత్మ జ్యోతిబా పూలే బీసీ గురుకుల బాలుర పాఠశాల, కళాశాలను అచ్చంపేట ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు డా. చిక్కుడు వంశీకృష్ణ స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న వసతులు, భోజన నాణ్యత, పరిసరాల పరిశుభ్రత, విద్యార్థుల భద్రతా ప్రమాణాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడంతో పాటు నాణ్యమైన విద్య అందించేందుకు అధికారులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి విద్యాభివృద్ధికి తోడ్పడాలని అన్నారు. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తుందని, గురుకులాల్లో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు అందేలా చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.







## ఏజీ కాలనీలో కాసా గ్రాండ్ పనులపై రగడ

- స్థానికుల తీవ్ర ఆందోళన
- కాసా గ్రాండ్ డెవలపర్స్ పనులతో మౌలిక వసతులకు నష్టం జరిగిందని ఆరోపణ
- రోడ్లు, డ్రైనేజీకి నష్టం.. కాసా గ్రాండ్ పనులపై కాలనీ వాసుల ఫిర్యాదు
- టిప్పర్ రాకపోకలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికుల వెల్లడి
- 11 కేవీ లైన్ ఏర్పాటుపై అధికారుల పరిశీలన కోరిన కాలనీ వాసులు



**మేడ్చల్, సెప్టెంబర్ 20 :** గుండ్లపోచంపల్లి డివిజన్‌లో ని ఏజీ కాలనీలో కాసా గ్రాండ్ డెవలపర్స్ చేపడుతున్న పనులపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణ కార్యకలాపాల వల్ల కాలనీలోని మౌలిక సదుపాయాలకు నష్టం వాటిల్లుతోందని వారు పేర్కొన్నారు. ముఖ్యంగా రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతింటున్నాయని ఆరోపిస్తూ సంబంధిత అధికారులకు సమస్యను వివరించారు. కాలనీ పరిధిలోని డ్రైనేజీ మ్యాన్‌హోల్స్‌కు నష్టం కలిగించడంతో పాటు రోడ్ల పరిస్థితి కూడా దెబ్బతిన్నదని స్థానికులు తెలిపారు. ప్లాట్ల సరిహద్దులను గుర్తించే హద్దురాళ్లు తొలగించారని ఆరోపించా రు. నిర్మాణ అవసరాల కోసం మట్టిని టిప్పర్ వాహనాల్లో తరలిస్తుండటంతో నిత్యం రాకపోకలకు ఆటంకం కలుగుతోం దని చెప్పారు. ఇదే సమయంలో 11 కేవీ విద్యుత్ లైన్ ఏర్పాటుపైనా స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. సరైన అనుమతులు లేకుండానే విద్యుత్ లైన్‌ను ప్రమాదకరంగా ఏర్పాటు చేశారని వారు ఆరోపిస్తున్నారు. ఇళ్ల నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతాలకు సమీపంలో విద్యుత్ లైన్ ఉండటం వల్ల ఎప్పుడైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై సంబంధిత శాఖల అధికా రులు వెంటనే స్పందించి ప్రాంతాన్ని ప్రత్యక్షంగా పరిశీలిం చాలని ఏజీ కాలనీ వాసులు కోరుతున్నారు. నిర్మాణ పనుల్లో నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు అధికారుల పరిశీలనలో నిర్ధారణ అయితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలు దెబ్బతినకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు.





## రామాలయంలో మహా అన్న ప్రసాదం

**ఇల్లందు :** గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా స్థానిక 24 ఏరియా లోని రామాలయంలో ఏర్పాటు చేసిన నవరాత్రి గణేష్ మండపం వద్ద ఆదివారం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్న ప్రసాదం కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గణనాథుని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. తమ శక్తి మేరకు వస్తు, ధన రూపాల్లో సహాయ సహకారాలు అందించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో 22వ వార్డు కౌన్సిలర్ కొర్లపాటి శివకిరణ్, ఉత్సవ కమిటీ సభ్యులు, ఏరియా యూత్, భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



## బ్యానర్ తొలగింపుపై పోలీసులకు ఫిర్యాదు

**కాప్రా :** కాప్రా చెరువు వద్ద గణేష్ నిమజ్జన ఏర్పాట్లలో భాగంగా ఏర్పాటు చేసిన డాక్టర్ ఏఎస్ రావునగర్ డివిజన్ గణేష్ ఉత్సవ సమితి రిజిస్టర్ బ్యానర్ తొ ల గించిన వారిపై చర్యలు తీసుకోవాలని సమితి కన్వీనర్ తాడూరి గగన్‌కుమార్ కుషా యిగూడ పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. తమ వద్ద ఉన్న ఆధారాలను పోలీసులకు అందజేశారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సమితి సభ్యులు రమేష్ యాదవ్, నిరుకొండ సతీష్ బాబు, ఆదినారాయణ, రమేష్ శివానంద్ తదితరులు పాల్గొన్నారు.



## నల్లగండ్లలో ఘనంగా గణపతి పూజా వేడుకలు

**శేరిలింగంపల్లి :** నల్లగండ్ల డివిజన్‌లో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 7వ రోజు గణపతి పూజా వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. నల్లగండ్ల హుడా రెసిడెన్సీ అసోసియేషన్ ఆధ్వర్యంలో హుడా కాలనీతో పాటు నేతాజీ నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన గణపతి మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా నల్లగండ్ల డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పల్లపు సురేందర్ పాల్గొని గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గణనాథుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షిస్తూ, నిర్వాహకులకు, భక్తులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.



## చింతకుంట కెనాల్‌లో గణేష్ నిమజ్జన ఏర్పాట్లు

**కరీంనగర్, సెప్టెంబర్ 20:** కరీంనగర్ చింతకుంట కెనాల్‌లో గణేష్ నిమజ్జన ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. నగరంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి సుమారు 700 గణేష్ ప్రతిమలను చింతకుంట కెనాల్‌లో నిమజ్జనం చేయనున్నట్లు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం ఉదయం నుంచే ఈ కెనాల్ వద్దకు భక్తులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో చేరుకునే అవకాశం ఉంది. నిమజ్జనానికి వచ్చే విగ్రహాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నారు. కెనాల్‌కు తాత్కాలిక అడ్డుకట్టలు ఏర్పాటు చేసి నీటిని నిల్వ చేసే చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. నిమజ్జన ప్రాంతంలో మున్సిపల్ కార్పొరేషన్, ఎస్పారెస్పీ, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తుల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకుంటూ, నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరిగేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు.



## పిల్లలకు ఆధార్ నవీకరణ తప్పనిసరి

### కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

**కరీంనగర్, సెప్టెంబర్ 20:** కరీంనగర్ కమాన్ వద్ద ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రారంభించారు. డిప్యూటీ మేయర్‌తో కలిసి ఆయన కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ ఆధార్ వివరాలను నవీకరించుకోవాలని సూచించారు. ముఖ్యంగా 5 నుంచి 15 ఏళ్ల పిల్లలు కేంద్రానికి వెళ్లి బయోమెట్రిక్ వివరాలను నవీకరించుకోవాలని కోరారు. జేఈఈ, నీట్ వంటి పోటీ పరీక్షలకు ఆధార్ వివరాలు ఉపయోగపడుతున్నాయని తెలిపారు. ఆధార్ వివరాలను ఎప్పటికప్పుడు సరిచూసుకుని అవసరమైన మార్పులు చేసుకోవాలని సూచించారు. పిల్లల ఆధార్ నవీకరణకు తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన కోరారు.



## శాంతినగర్‌లో ఘనంగా గణపతి నవరాత్రి ఉత్సవాలు

- 12 ఏళ్లుగా కొనసాగుతున్న శివాజీ యువసేన ఉత్సవాలు
- అన్నదాన కార్యక్రమానికి విశేష స్పందన

**పెద్దపల్లి, ఇదే నిజం, సెప్టెంబర్ 20 :** పెద్దపల్లి పట్టణంలోని శాంతినగర్‌లో శివాజీ యువసేన ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. 2వ వార్డు కౌన్సిలర్ పస్తం లక్ష్మీ జంపయ్య ఆధ్వర్యంలో గత 12 సంవత్సరాలుగా ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రత్యేకంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రతి సంవత్సరం భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా భక్తుల కోసం అన్నదానంతో పాటు పలు సేవా కార్యక్రమాలను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పస్తం హనుమంతు, శివాజీ యువసేన సభ్యులు, భక్తులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌నినో కాదు.. ప్రభుత్వ విధానాలే

# రైతుల పాలిట ముప్పు : హరీశ్‌రావు

- కరెంట్ కోతలు, సాగునీటి కొరతతో పంటలు ఎండిపోతున్నాయన్న మాజీ మంత్రి
- కేసీఆర్‌కు అనుకూలంగా సర్వే ఫలితాలు.. అందుకే బీఆర్ఎస్‌లోకి వలసలంటూ వ్యాఖ్యలు
- 420 హామీల అమలుపై సీఎం రేవంత్‌రెడ్డిని హరీశ్‌రావు నిలదీత





**మోత్కూరు, సెప్టెంబర్ 20 :** రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు ప్రభుత్వ విధానాలే కారణమని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనపై తీవ్ర విమర్శలు చేసిన ఆయన.. ప్రకృతి ప్రభావాలతో పోలిస్తే ప్రస్తుత ప్రభుత్వ నిర్ణయాల వల్లే రాష్ట్రానికి ఎక్కువ నష్టం జరుగుతోందని వ్యాఖ్యానించారు. ఉద్దేశపూర్వకంగా విద్యుత్ సరఫరాను తగ్గిస్తున్నారని, సాగునీరు అందుబాటులో ఉన్నప్పటికీ ప్రాజెక్టుల ద్వారా నీటిని విడుదల చేయడం లేదని ఆరోపించారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరులో కాంగ్రెస్‌కు చెందిన పలువురు నాయకులు బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో హరీశ్‌రావు మాట్లాడారు. రాష్ట్రంలో నిర్వహిస్తున్న పలు సర్వేల్లో కేసీఆర్‌కు అనుకూలమైన ఫలితాలు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలోనే కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి నాయకులు, కార్యకర్తల చేరికలు పెరుగుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో విద్యుదుత్పత్తికి అవకాశం ఉన్నప్పటికీ బొగ్గు కొరతను కారణంగా చూపుతూ సరఫరాలో కోతలు విధిస్తున్నారని హరీశ్‌రావు విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించామని, ప్రస్తుతం మాత్రం నాణ్యత లేని విద్యుత్ పరిమిత సమయం మాత్రమే లభిస్తోందని అన్నారు. దీనివల్ల వ్యవసాయానికి ఇబ్బందులు ఏర్పడి పంటలు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. కృష్ణా నదిలో నీటి లభ్యత ఉన్నప్పటికీ కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలను నడపడం లేదని హరీశ్‌రావు ఆరోపించారు. ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోకపోవడంతో రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో వాస్తవ పరిస్థితులకు భిన్నంగా కరవు పరిస్థితులను ప్రభుత్వం సృష్టిస్తోందని విమర్శించారు. రైతులకు సంబంధించిన ఆర్థిక సహాయంపై కూడా ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మూడు పంటల కాలానికి రైతుబంధు సొమ్ము అందలేదని ఆరోపించారు. కరోనా వంటి క్లిష్ట సమయంలోనూ అప్పటి కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని కొనసాగించిందని గుర్తుచేశారు. రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పుకుంటున్న కాంగ్రెస్ పాలనలో మాత్రం రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వ్యాఖ్యానించారు. యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని సాక్షిగా చేసుకుని ఇచ్చిన హామీల విషయంలోనూ సీఎం రేవంత్‌రెడ్డిపై హరీశ్‌రావు విమర్శలు చేశారు. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన 420 అంశాలతో పాటు గొర్రెల పంపిణీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర పథకాల అమలుపై ఆయన ప్రశ్నలు సంధించారు. తనను లక్ష్యంగా చేసుకుని బెదిరింపులకు పాల్పడినా తాను వెనక్కి తగ్గబోనని హరీశ్‌రావు స్పష్టం చేశారు. కేసీఆర్‌ను విమర్శించడం ద్వారా రైతుల సమస్యలు పరిష్కారం కావని అన్నారు. పాలనను సక్రమంగా నిర్వహించలేకపోతే ప్రజలకు క్షమాపణలు చెప్పాలని సీఎం రేవంత్‌రెడ్డికి సూచించారు.

## కేసీఆర్-రేవంత్ పాలనపై

# రఘునందన్ ఘాటు వ్యాఖ్యలు

**అసెంబ్లీ వ్యవహారాలపై ఫైర్**

- ప్రజా సమస్యల్ని పక్కనపెట్టి రెండు పార్టీలు పరస్పర ఆరోపణలతో కాలక్షేపం చేస్తున్నాయన్న ఎంపీ
- ఖైరతాబాద్ ఉప ఎన్నికలో బీజేపీ విజయం సాధిస్తుందని రఘునందన్‌రావు ధీమా
- నిజాం పాలనపై అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై విమర్శలు



**హైదరాబాద్, సెప్టెంబర్ 20:** తెలంగాణ రాజకీయాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ తీరుపై బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్‌రావు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. శాసనసభ సమావేశాల్లో ప్రజలకు సంబంధించిన అంశాల కంటే ఇరు పార్టీల మధ్య రాజకీయ ఘర్షణలకే ప్రాధాన్యం దక్కిందని ఆరోపించారు. ఆదివారం హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన.. అధికార, ప్రతిపక్ష సభ్యుల వ్యవహారశైలిపై విమర్శలు చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు సభలో పరస్పరం పోరాడుతున్నట్లు కనిపించినా.. వారి రాజకీయ విధానాల్లో పెద్దగా తేడా లేదని రఘునందన్‌రావు వ్యాఖ్యానించారు. తెలంగాణ అభివృద్ధి, ప్రజా సమస్యలపై చర్చ జరగాల్సిన సమయంలో రాజకీయ ప్రదర్శనలకే ప్రాధాన్యం ఇస్తున్నారని అన్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు బుల్లెట్‌ప్రూఫ్ బస్సులో ఫామ్‌హౌస్‌ల వద్దకు వెళ్లడాన్ని కూడా ఆయన ప్రశ్నించారు. దీనిని అధికార యంత్రాంగం వినియోగానికి సంబంధించిన అంశంగా అభివర్ణించారు. భూముల వ్యవహారంపై కూడా ఎంపీ స్పందించారు. భూములకు సంబంధించిన ప్రభుత్వ రికార్డులు అధికారుల వద్దే ఉన్నప్పుడు క్షేత్రస్థాయిలో మరోసారి పరిశీలనలు నిర్వహించడం వెనుక ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికను ప్రస్తావిస్తూ దానం నాగేందర్‌కు ఈ ఎన్నిక అనుకూలంగా ఉండదని వ్యాఖ్యానించారు. ఈ నియోజకవర్గంలో బీజేపీ విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇక మాజీ సీఎం కేసీఆర్, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డిపై రఘునందన్‌రావు చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చకు దారితీశాయి. ఇరువురి పాలనలోనూ ప్రజలపై ఒత్తిడి పెరిగిందని విమర్శిస్తూ.. వారిని 'నయా నిజాంలు'గా అభివర్ణించారు. నిజాం పాలనకు సంబంధించి అసెంబ్లీలో కేసీఆర్, రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోలను మీడియా సమావేశంలో ప్రదర్శించారు. నిజాం పాలనలో చోటుచేసుకున్న చారిత్రక ఘటనలను ప్రస్తావిస్తూ.. బైరాన్‌పల్లి ఘటన, ఆదివాసీలపై జరిగిన దాడులు, మహిళలపై జరిగిన దురాగతాలను గుర్తుచేశారు. అలాంటి చారిత్రక నేపథ్యం ఉన్న పాలనను ప్రశంసించడం సమంజసమేనా అని ప్రశ్నించారు. నిజాం పాలనను వ్యతిరేకిస్తూ జరిగిన ఉద్యమాలను కూడా ఆయన ప్రస్తావించారు. హైదరాబాద్ సంస్థానాన్ని భారత యూనియన్‌లో విలీనం చేసే క్రమంలో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ చేపట్టిన ఆపరేషన్ పోలోను ప్రస్తావించిన రఘునందన్‌రావు.. నిజాం పాలనను సమర్థిస్తే ఆ చారిత్రక పోరాటాల అర్థం ఏమిటని ప్రశ్నించారు. దాశరథి, కొమురం భీమ్, రాంజీ గోండు, కొండా లక్ష్మణ్ బాపూజీ, నారాయణరావు పవార్, రామానంద తీర్థ, ఆర్యసమాజ్ తదితరుల పోరాటాలను గుర్తుచేశారు. కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్, రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ విషయంలో కమ్యూనిస్టు పార్టీల వైఖరిపైనా రఘునందన్‌రావు విమర్శలు చేశారు. తెలంగాణలో జరుగుతున్న రాజకీయ పరిణామాలను ప్రజలు గమనిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.



## పేకాట స్థావరంపై పోలీసుల దాడి..

- రూ.40 వేల నగదు సహా సీజ్.. 16 మందిపై కేసు నమోదు
- బొంతపల్లిలో రహస్యంగా సాగుతున్న జూదంపై పోలీసుల ఆకస్మిక తనిఖీ
- రూ.40 వేలకుపైగా నగదు.. 16 ఫోన్లు, 6 వాహనాలు సీజ్
- తెలంగాణ గేమింగ్ చట్టం కింద కేసు నమోదు

**గుమ్మడిదల, సెప్టెంబర్ 20 :** బొంతపల్లి గ్రామంలో మూసివేసిన భవనాన్ని పేకాటకు అడ్డాగా మార్చుకున్న 16 మందిని గుమ్మడిదల పోలీసులు పట్టుకున్నారు. భారత్ పెట్రోల్ బంక్‌కు ఎదురుగా ఉన్న భవనంలో నగదు పందేలు జరుగుతున్నాయన్న సమాచారంతో ఎస్ఐ అరుణ్ కుమార్ నేతృత్వంలో సిబ్బంది అక్కడికి చేరుకుని తనిఖీలు చేపట్టారు. పోలీసుల రాకతో అక్కడ పేకాట వ్యవహారం వెలుగు లోకి వచ్చింది. స్థావరంలో ఉన్న 16 మందిని అదుపులోకి తీసుకున్న అధికారులు వారి నుంచి రూ. 40,650 నగదును గుర్తించారు. అలాగే 15 స్మార్ట్‌ఫోన్లు, ఒక నోకియా కీప్యాడ్ మొబైల్ కలిపి మొత్తం 16 ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు ఐదు బైక్‌లు, ఒక మారుతీ సుజుకీ ఎస్-ప్రెస్సో కారును కూడా సీజ్ చేశారు. పోలీసులు నిర్వహించిన పంచనామా ఆధారంగా కేసు నమోదు ప్రక్రియను పూర్తి చేశారు. తెలంగాణ గేమింగ్ చట్టంలోని సెక్షన్లు 3, 4 ప్రకారం క్రైమ్ నంబర్ 203/2026 నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. గుమ్మడిదల పోలీస్‌స్టేషన్ పరిధిలో పేకాట, జూదం లేదా ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిఘా కొనసాగుతుందని ఎస్ఐ అరుణ్ కుమార్ స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.



## గణనాథుడి ఊరేగింపుతో మార్మోగిన జీఎంఆర్ కాలనీ

### భారీ శోభాయాత్ర.. ఘనంగా నిమజ్జనం

- కాజిపల్లి జీఎంఆర్ కాలనీలో గణపయ్యకు ఘన వీడ్కోలు
- తొమ్మిది రోజుల పూజల అనంతరం వైభవంగా గణనాథుడి నిమజ్జనం
- డప్పులు, భక్తిగీతాలతో సాగిన ప్రత్యేక ఊరేగింపు
- లడ్డూ వేలం అనంతరం మాధవానికుంటలో నిమజ్జనం

**గుమ్మడిదల (జిన్నారం), సెప్టెంబర్ 20 :** తొమ్మిది రోజులుగా పూజలు అందుకున్న కాజిపల్లి జీఎంఆర్ కాలనీ వినాయకుడికి ఆదివారం ఘనంగా వీడ్కోలు పలికారు. గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని కాలనీలో జర్నలిస్టుల ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన విఘ్నేశ్వరుడికి నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా కాలనీలో సందడి నెలకొంది. నిమజ్జన వేడుకల్లో భాగంగా ముందుగా గణపతి లడ్డూ ప్రసాదానికి వేలం నిర్వహించారు. స్థానికంగా ఉన్న భక్తుడు లడ్డూను సొంతం చేసుకున్నారు. అనంతరం విగ్రహాన్ని పుష్పాలతో అందంగా అలంకరించి ఊరేగింపునకు సిద్ధం చేశారు. కాలనీ నుంచి బయలుదేరిన గణపతి ఊరేగింపు శంబిపూర్, కాజిపల్లి, మల్లంపేట చౌరస్తా మీదుగా కొనసాగింది. పెద్ద సంఖ్యలో యువత, స్థానికులు, భక్తులు పాల్గొని గణపతి నామస్మరణ చేస్తూ ముందుకు సాగారు. భక్తిగీతాలతో పరిసర ప్రాంతాల్లో పండుగ వాతావరణం కనిపించింది. అనంతరం బొల్లారం పట్టణ సమీపంలోని మాధవానికుంట వద్దకు చేరుకున్న శోభాయాత్రకు ముగింపు పలికారు. అక్కడ భక్తుల సమక్షంలో గణనాథుడి నిమజ్జనాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు శేఖర్ గౌడ్, వీరేశం గౌడ్, ప్రదీప్ రాజ్, నాగభూషణం, సురేష్, మహేందర్ గౌడ్, జీఎంఆర్ కాలనీకి చెందిన భక్తులు పాల్గొన్నారు.

# ప్రజాసేవే ఆయనకు అసలైన నివాళి..

- సింగిరెడ్డి మాధవరెడ్డి సేవల స్మరణ
- గౌడవెల్లిలో మాధవరెడ్డి 17వ వర్ధంతి కార్యక్రమం
- విగ్రహానికి పుష్పాంజలి ఘటించిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు
- ఆయన ఆశయాలను కొనసాగిస్తామని హరివర్ధన్ రెడ్డి వెల్లడి




**మేడ్చల్, సెప్టెంబర్ 20 :** స్వాతంత్ర్య ఉద్యమం, తెలంగాణ తొలి దశ ఉద్యమంలో సింగిరెడ్డి మాధవరెడ్డి చేసిన సేవలను పలువురు నాయకులు గుర్తుచేసుకున్నారు. ప్రజల హక్కులు, సామాజిక ప్రయోజనాలు, ప్రాంతీయ అభివృద్ధి కోసం ఆయన సాగించిన కృషి భావితరాలకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఆయన 17వ వర్ధంతిని పురస్కరించుకుని గౌడవెల్లిలోని మాధవరెడ్డి చౌరస్తా వద్ద స్మరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సింగిరెడ్డి మాధవరెడ్డి కుమారుడు, టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. మాధవరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేశ స్వాతంత్ర్యం, తెలంగాణ ప్రాంతం కోసం ఆయన అందించిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. హరివర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. తన తండ్రి జీవితమంతా ప్రజా ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు. సామాన్యుల ఇబ్బందులను తనవిగా భావించి పరిష్కారం కోసం కృషి చేసిన వ్యక్తిగా మాధవరెడ్డి నిలిచిపోయారని అన్నారు. సమాజం పట్ల ఆయనకు ఉన్న బాధ్యత, ప్రజల పట్ల చూపిన అంకితభావం నేటి తరానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. మాధవరెడ్డి ఆశయాలను ఆచరణలో కొనసాగించడమే ఆయనకు సరైన గౌరవమని తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధులు, తెలంగాణ ఉద్యమకారులు చేసిన త్యాగాలను యువత తెలుసుకోవాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు. మాధవరెడ్డి సేవలను భవిష్యత్ తరాలకు పరిచయం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమానికి అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ కంఠం కృష్ణారెడ్డి, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేడ్చల్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు చాపరాజు, కిష్టాపూర్--పూడూరు డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లేష్ గౌడ్, గుండ్లపోచంపల్లి డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సురేందర్ ముదిరాజ్, ఎల్లంపేట్ మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు విఘ్నేశ్వర్ రెడ్డి హాజరయ్యారు. మేడ్చల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రేగు రాజు, దుర్గం శివశంకర్ ముదిరాజ్, ఓబీసీ సెల్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు గుర్ర రవి ముదిరాజ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఉదండపురం సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్లు చీర్ల రమేష్, కొడే మహేష్‌తో పాటు కాంగ్రెస్ సీనియర్ నాయకులు వేముల మహేష్ గౌడ్, బిపిటి రాజు, వేముల శ్రీనివాస్ రెడ్డి, రామన్నగారి సంతోష్ గౌడ్, చెర్వుకొమ్ము శేఖర్ గౌడ్, రఘుపతి రెడ్డి, చంద్రయ్య గౌడ్, గణేష్, ముక్తార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాధవరెడ్డి విగ్రహానికి పుష్పమాలలు సమర్పించి ఘనంగా స్మరించుకున్నారు. ఆయన చూపిన ప్రజాసేవా మార్గంలో ముందుకు సాగుతూ ఆశయాలను కొనసాగిస్తామని వెల్లడించారు.

నిద్ర పట్టకపోవడం, గుండె దడ, పదిమందిలోకి వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారా ? అయితే మీరు ఫోబియాతో బాధపడుతున్నట్టే. కొన్నాళ్లు గా ఇలాంటి వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోందని మానసిక వైద్య నిపుణులు చెబుతున్నారు. 30 నుంచి 50 ఏళ్లలోపు ఉన్న వారిలో ఈ సమస్య అధికంగా కనిపిస్తోందని, నిర్లక్ష్యం వహిస్తే మానసిక సమస్యల బారినపడే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ఈ తరహా సమస్యతో బాధపడుతూ పట్టణ పరిధిలోని మానసిక వైద్య నిపుణుల వద్దకు ప్రతిరోజూ ఇద్దరు, ముగ్గురు రోగులు వస్తున్నారని, గతంలో నెలకు ఐదుకు మించి కేసులు వచ్చేవి కావంటున్నారు.

ఫోబియాను రెండు రకాలుగా చెబుతారు. ఏదైనా వస్తువు, జంతువులు, ఇతర అంశాల పట్ల కలిగే భయం వల్ల వచ్చే దానిని ఇండివిడ్యువల్ లేదా జూ ఫోబియా అంటారు. పదిమందిలోకి వెళ్లేందుకు భయపడినా, గుండె దడ, ప్రతిదానికీ ఆందోళన వంటి లక్షణాలుంటే క్లాస్టరో ఫోబియా అంటారు. ఈ ఫోబియాతో బాధపడుతున్న వారి సంఖ్య ఇటీవల పెరుగుతోందని, దీనికి అనేక అంశాలు కారణమంటున్నారు. వీరిలో ఎక్కువ శాతం స్నేహితులకు దూరంగా ఉండడం, పదిమందితో మాట్లాడితే ఎదుటివారు ఏమనుకుంటారో అని ఆత్మనూన్యతా భావం కలిగి ఉండడం లాంటి సమస్యలు ప్రధానంగా ఉంటాయి.



# ఫోబియా పరేషాన్

- ఇటీవల పెరుగుతున్న బాధితుల సంఖ్య
- 30 నుంచి 50 ఏళ్ల మధ్య వయసు వారిలో అధికం
- నిద్ర పట్టకపోవడం, గుండె దడ, భయం తదితర లక్షణాలు
- కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు
- సోషల్ మీడియా వినియోగం, మెదడుపై అధిక ఒత్తిడే కారణం
- మైర్మెకోఫోబియాతో గృహిణి మనీష ఉరి వేసుకుని ఆత్మహత్య
- సకాలంలో గుర్తిస్తే చెక్ చెప్పే అవకాశం
- లక్షణాలను గుర్తించి అప్రమత్తం కావాలి : డాక్టర్.బత్తుల శ్రీధర్, సైకాలాజిస్ట్





## ఇవీ ప్రధాన లక్షణాలు :

క్లాస్ట్రో ఫోబియాతో బాధపడే వారిలో నిద్ర పట్టకపోవడం, గుండెదడ, భయం, ఆందోళన, యాంగ్జైటీ, రెస్ట్స్ ఊపిరి ఆడకపోవడం, బీపీ పెరుగుతుండడం వంటి లక్షణాలు ఉ ంటాయి. ఎక్కువ మందిలోకి వెళ్లినా, ఎవరితోనైనా మాట్లాడేందుకు ప్రయత్నించినా ఇటువంటి లక్షణాలు కనిపిస్తుంటాయి. దీనికి అనేక అంశాలు కారణమని నిపుణులు చెబుతున్నారు. కుటుంబసమస్యలు, ఆరోగ్య, ఆర్థిక ఇబ్బందులు, మెదడుపై అధిక ఒత్తిడి. ఆత్మన్యూనతాభావం, సోషల్ మీడియాను అధికంగా వినియోగించడం వల్ల మెదడుకు విశ్రాంతి లేకుండా చేయడం వల్ల సమస్య బారినపడేస్తుందంటున్నారు. కొందరిలో కుటుంబ నేపథ్యం సైతం కారణమంటున్నారు ఆరోగ్య నిపుణులు.

## ఫోబియా నుంచి బయటపడే మార్గమేదీ ? :

ఈ సమస్య నుంచి బయటపడేందుకు కొన్ని అంశాలు దోహదపడతాయి. యోగా, మెడిటేషన్, మ్యూజిక్ వినడం, మనసుకు ఉత్సాహాన్ని కలిగించే ఆటలాడడం, శారీరక శ్రమ, పుస్తకాలు చదవడం, కొత్త విషయాలను నేర్చుకునేందుకు ఆసక్తి చూపించడం వంటి ఉపకరిస్తాయి. కొన్ని సందర్భాల్లో మందులు, కౌన్సెలింగ్ అవసరమవుతుంది.

## ఫోబియా భయాలు :

- అరాక్నో ఫోబియా- సాలెపురుగులంటే భయం
- సైనో ఫోబియా- కుక్కలంటే భయం
- ఎంటమో ఫోబియా- కీటకాలను చూస్తే భయం
- ఓఫిడియో ఫోబియా- పాములంటే భయం
- మైర్మెకో ఫోబియా- చీమలను చూస్తే భయం
- ఆక్రోఫోబియా- ఎత్తయిన ప్రదేశాలంటే భయం
- అగోరా ఫోబియా- బహిరంగ ప్రదేశాల్లో భయం
- ఆస్ట్రో ఫోబియా- ఉరుములు, మెరుపులు చూస్తే భయం



## మైర్మెకోఫోబియాతో గృహిణి మనీష ఉరి వేసుకుని ఆత్మహత్య :

చీమలు నన్ను బతకనివ్వవు.. నేను వెళ్లిపోతున్నా.... పాపను బాగా చూసుకోండి అంటూ ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. మంచిర్యాలకు చెందిన చిందం శ్రీకాంత్, మనీషా (25) దంపతులతో పాటు వారి మూడేళ్ల పాప అనికతో కలిసి అమీన్ ప్పూర్ పురపాలక సంఘం పరిధిలో గల నవ్య కాలనీలో నివాసముంటున్నారు. అయితే మనీషకు చిన్నప్పటి నుంచి చీమలకు భయపడే మైర్మెకోఫోబియా అనే వ్యాధి ఉండడంతో మనీష భర్త శ్రీకాంత్ ఆఫీస్ కు వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికి రాగా లోపల నుంచి గడియ పెట్టి ఉంది. స్థానికుల సహాయంతో డోర్ పగలగొట్టి చూడగా సీలింగ్ ఫ్యాన్కు మనీషా చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె పక్కనే దొరికిన లేఖలో చీమలు భరించడం తన వల్ల కావడం లేదని, అందుకే చనిపోతున్నానని పేర్కొంది. కూతురు అనికాను జాగ్రత్తగా చూసుకోమని చెప్తూ వదిలి వెళ్తున్నందుకు క్షమించాలని భర్తను వేడుకుంది. అన్నవరం తిరుపతి హుండీలో రూ.1,116 వేయడంతో పాటు ఎల్లమ్మ తల్లికి ఒడి బియ్యం పోయాలని లేఖలో తెలిపింది. ఎప్పుడూ వినని సమస్యతో మహిళ ఆత్మహత్య చేసుకోవడం స్థానికంగా విషాదం నింపింది.





## లక్షణాలను గుర్తించి అప్రమత్తం కావాలి

ఫోబియా లక్షణాలను గుర్తించి వెంటనే అప్రమత్తం కావాలి. కుటుంబ సభ్యులతో కలిసి మానసిక వైద్య నిపుణులు, సైకాలజిస్టులను సంప్రదించాలి. గుండె దడ, నిద్ర పట్టకపోవడం, తీవ్రమైన ఆందోళన వల్ల ఇబ్బంది పడుతూ ఉంటారు. ఎవరికీ చెప్పుకోలేక, బయటకు రాలేక మదనపడు తుంటారు. వారికి వైద్యసహాయం అందించాలి. నిపుణుల సలహా మేరకు కౌన్సెలింగ్ ఇప్పించాలి. లేదంటే తీవ్రమైన మానసిక సమస్యలకు కారణవ-ంవుతుంది. కొన్నిసార్లు మ్యూజిక్ వినడం, మెడిటేషన్, యోగా ద్వారా సమస్య నుంచి బయటపడే వీలుంది. పోషకాహారం తీసుకోవడం, తగినంత నిద్రపోవడం, మద్యం, మాదక ద్రవ్యాల జోలికి వెళ్లకపోవడం ఇతర పనుల్లో నిమగ్నం కావడం వల్ల ఈ ఫోబియాలను నుంచి దూరం కావచ్చు.

**- డాక్టర్.బత్తుల శ్రీధర్, సైకాలాజిస్ట్**

మట్టి కుండలో నిల్వ చేసే నీరు, సాధారణంగా మట్కా వాటర్ గా పిలవబడే ఈ సంప్రదాయ పద్ధతిని, వేసవి కాలంలో చాలా మంది ఉపయోగిస్తారు. విద్యుత్ అవసరం లేకుండా సహజంగా నీటిని చల్లగా ఉంచే ఈ విధానం ఆరోగ్యపరంగా కూడా అనేక ప్రయోజనాలను అందిస్తుందని తాజా పరిశోధనలు సూచిస్తున్నాయి. అయితే మట్టికుండల నాణ్యత, శుభ్రత, నిల్వ విధానాలపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మట్కాలో నిల్వ చేసిన నీరు సహజంగా చల్లబడుతుంది. మట్టికుండల రంధ్రాల వల్ల నీరు స్వల్పంగా ఆవిరైపోతూ, లోపల ఉన్న నీటి ఉష్ణోగ్రతను తగ్గిస్తుంది. ఫ్రిజ్‌లో ఉంచిన నీటితో పోలిస్తే ఇది గొంతుకు మృదువుగా ఉంటుంది. ఆకస్మికంగా చల్లని నీరు తాగడం వల్ల కలిగే టెంపరేచర్ షాక్ సమస్యలను మట్కా నీరు నివారిస్తుంది.



# మట్టి కుండ నీళ్లు..
# ఆరోగ్యానికి మేలు

## అనేక ప్రయోజనాలు..

మట్కా నీరు శరీరంలోని పీహెచ్ స్థాయిలను సమతుల్యం చేయడంలో సహాయపడుతుంది. మట్టికుండలలో ఉండే క్షార గుణాలు నీటిలోని ఆమ్లత్వాన్ని తగ్గించి, వేసవిలో తరచుగా ఎదురయ్యే ఆమ్లత్వ సమస్యలను తగ్గిస్తాయి. దీని వల్ల జీర్ణ వ్యవస్థపై ఒత్తిడి తగ్గి, గట్ (జీర్ణ వ్యవస్థ) హెల్త్ మెరుగుపడుతుంది. జీర్ణక్రియ, మెటబాలిజం మెరుగుపడటంలో కూడా మట్కా నీరు సహాయపడుతుందని పరిశోధనలు చెబుతున్నాయి. మట్టిలో సహజంగా ఉండే ఖనిజాలు శరీరానికి ఉపయోగకరంగా పనిచేస్తాయి. అయితే మట్టికుండను సక్రమంగా శుభ్రపరచకపోతే బ్యాక్టీరియా పెరిగే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఫ్రిజ్ నీటితో పోలిస్తే మట్కా నీరు గొంతుకు, శ్వాసకోశానికి హితంగా ఉంటుంది. వేసవిలో చల్లని నీరు తాగడం వల్ల వచ్చే దగ్గు, జలుబు సమస్యలను ఇది తగ్గిస్తుంది. అయితే నీటిని కప్పుతో మూసి ఉంచడం, శుభ్రత పాటించడం తప్పనిసరి. కాలుష్యం అనుమానం ఉన్నప్పుడు ఆ నీటిని వాడకూడదు. మట్కా నీరు ప్రత్యేకమైన రుచిని కలిగి ఉంటుంది. మట్టిలోని సహజ గుణాల వల్ల నీటికి స్వల్ప భూమి వాసన, రుచులు చేరతాయి. సాధారణంగా ఈ నీటి ఉష్ణోగ్రత 10 నుండి 14 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉంటుంది. ప్లాస్టిక్ బాటిళ్లలో నిల్వ చేసే నీటితో పోలిస్తే మట్కా నీరు ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయం.



## పర్యావరణ పరిరక్షణకు కూడా..

పర్యావరణ పరిరక్షణ కోణంలో కూడా మట్కా నీరు ఉపయోగకరం. ప్లాస్టిక్ వినియోగం తగ్గించి, విద్యుత్ అవసరం లేకుండా సహజ పద్ధతిలో నీటిని చల్లబరచడం ద్వారా కార్బన్ ఫుట్‌ప్రింట్ తగ్గించవచ్చు. సంప్రదాయ పద్ధతులను తిరిగి అనుసరించడం ద్వారా పర్యావరణానికి మేలు జరుగుతుంది. మట్టికుండలలో నిల్వ చేసే నీటిలో క్యాల్షియం, మెగ్నీషియం వంటి ఖనిజాలు ఉంటాయి. ఇవి ఎముకల ఆరోగ్యానికి ఉపయోగపడతాయి. అయితే ఖనిజాల మోతాదు సమతుల్యంగా ఉండటం అవసరం. అధికంగా లేదా తక్కువగా ఉన్నా ఆరోగ్యంపై ప్రభావం చూపిస్తాయి. మట్కా నీరు ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలు అందించినప్పటికీ, సరైన శుభ్రత, నిల్వ విధానాలు పాటించడం అత్యంత ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు. నీరు కలుషితమైందని అనుమానం వచ్చిన వెంటనే దాన్ని వాడకుండా పారబోయడం ఉత్తమమని చెబుతున్నారు.

# అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ సేల్




పండగ ఆఫర్ల కోసం ఎదురు చూస్తున్నారా? అయితే గుడ్‌న్యూస్. ప్రముఖ ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్ 'గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ 2026' సేల్ తేదీని ప్రకటించింది. అక్టోబర్ 8 నుంచి ఈ సేల్ ప్రారంభం కానుంది. మరో ఇ-కామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్ కూడా 'బిగ్ బిలియన్ డేస్ 2026' సేల్ తేదీని ప్రకటించిన విషయం తెలిసిందే. ఇది అక్టోబర్ 9న రాబోతుంది. పండగ సీజన్‌లో భాగంగా ఫ్లిప్‌కార్ట్ సేల్ కంటే ఒక్కరోజు ముందుగానే అమెజాన్ సేల్ రావడం గమనార్హం. ఫ్లిప్‌కార్ట్ బ్లాక్ మెంబర్లకు అక్టోబర్ 8నే సేల్ ప్రారంభమవుతుంది. గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ సేల్‌లో భాగంగా ఎస్‌బీఐ డెబిట్ కార్డు, క్రెడిట్ కార్డు హోల్డర్స్‌కు 10 శాతం ఇన్‌స్టంట్ డిస్కౌంట్ అందిస్తామని అమెజాన్ తన మైక్రోసైట్‌లో పేర్కొంది. ప్రైమ్ మెంబర్లకు 10 శాతం వరకు అదనపు ఆఫర్లు ఉంటాయని తెలిపింది. సేల్ ఎప్పటివరకు అనేది మాత్రం వెల్లడించలేదు. 8 పీఎం డీల్స్, బ్లాక్ బస్టర్ డీల్స్, టాప్ 100 డీల్స్, మెగా డీల్స్ పేరుతో పలు రకాల ఆఫర్లను అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించింది. ఆఫర్ల వివరాలు సేల్ తేదీ దగ్గర పడే కొద్ది వెల్లడికానున్నాయి.



# బిజినెస్




## నెట్ బ్యాంకింగ్.. యూపీఐ వాడకంలో
# జాగ్రత్తలు తప్పనిసరి

**సాంకేతికంగా చూస్తే నెట్ బ్యాంకింగ్, యూపీఐ రెండు సురక్షితమైనవే. దేశంలోని కఠినమైన డిజిటల్ చెల్లింపుల నియంత్రణ పరిధిలోనే ఇవి పనిచేస్తాయి. రెండింటిలోనూ తగిన రక్షణ వ్యవస్థలు, ధ్రువీకరణ విధానాలు ఉన్నాయి. కానీ, ఇక్కడ అసలైన సమస్య సాంకేతికతతో లేదు. మనం ఎవరికి డబ్బులు పంపుతున్నాం, ఆ లావాదేవీని ముందే సరిగ్గా తనిఖీ చేసుకున్నామా లేదా అనేదానిపైనే భద్రత ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం నకిలీ వెబ్‌సైట్లు, క్యూఆర్ కోడ్ మోసాలు, డిజిటల్ అరెస్టుల కాలంలో ఈ వ్యత్యాసాన్ని అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం.**

### పెద్ద మొత్తాల చెల్లింపులకు..

- పెద్ద మొత్తంలో బిల్లులు చెల్లిస్తున్నప్పుడు మనం ఏ సంస్థకు డబ్బులు చెల్లించాలో, ఆ అధికారిక వెబ్‌సైట్ లేదా యాప్‌ను మనమే స్వయంగా ఓపెన్ చేయాలి. అక్కడ బిల్లు వివరాలు, చెల్లించాల్సిన మొత్తాన్ని సరి చూసుకోవాలి.
- ఆ తర్వాతే అందులో చూపించే చెల్లింపుల మార్గాన్ని ఎంచుకోవాలి. ఈ విధానం వల్ల మనం సరైన సంస్థకే డబ్బులు పంపుతున్నామని నిశ్చింతగా ఉండొచ్చు. ఆ తర్వాత నెట్ బ్యాంకింగ్ వాడినా, కార్డు వాడినా, యూపీఐ వాడినా ప్రమాదం ఉండదు.

### నెట్ బ్యాంకింగ్‌లో రక్షణ ఎంత?

నెట్ బ్యాంకింగ్, బ్యాంకు మొబైల్ యాప్ లావాదేవీలు పూర్తిగా బ్యాంకు నియంత్రణలో జరుగుతాయి. పెద్ద మొత్తంలో డబ్బులు పంపేటప్పుడు అవతలి వ్యక్తి ఖాతా నంబరు, పేరు వంటి వివరాలను నిదానంగా తనిఖీ చేసుకునే అవకాశం ఇందులో ఉంటుంది. నెట్ బ్యాంకింగ్‌లోనూ మోసాలు జరుగుతాయి. మోసగాళ్లు బ్యాంకు వ్యవస్థలను హ్యాక్ చేయాల్సిన అవసరం లేదు. నిజమైన బ్యాంకు సైటును పోలిన నకిలీ వెబ్‌సైట్‌ను సృష్టించి, మన యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌లను దొంగిలిస్తారు. మనం స్వయంగా మన వివరాలను నకిలీ వెబ్‌సైట్లలో నమోదు చేస్తే.. బ్యాంకు రక్షణ వ్యవస్థలు కూడా మనల్ని కాపాడలేవు. ఖాతాదారుడి నిర్లక్ష్యం వల్ల సమాచారం బయటికి పోతే నష్టానికి ఖాతాదారుడే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆర్‌బీఐ నిబంధనలూ స్పష్టం చేస్తున్నాయి.

### యూపీఐ.. సులువే కానీ.. జాగ్రత్తగా..




- యూపీఐ పూర్తిగా ఆర్‌బీఐ నియంత్రణలోనే పనిచేస్తుంది. ఇందులో పిన్ నంబరే ప్రధాన రక్షణ. ఈ పిన్‌ను ఎవరికీ చెప్పొద్దు అనేది ప్రాథమిక హెచ్చరిక. యూపీఐ యాప్‌లూ మీ పిన్‌ను ఎక్కువగా దాచి ఉంచవు. బ్యాంకు సిబ్బందీ మీ పిన్‌ను అడగరని గుర్తుంచుకోవాలి.
- యూపీఐ వేగం, సులభంగా ఉండే గుణం ఒక్కోసారి మోసాలకు దారితీస్తుంది. మానవ తప్పిదాల వల్లే ఇక్కడ ఎక్కువ నష్టం జరుగుతుంది.
- అవతలి వ్యక్తి వివరాలు సరిచూసుకోకుండానే తొందరపడి డబ్బులు పంపితే వేరే వారికి వెళ్లే ప్రమాదం ఉంది.
- క్యూఆర్ కోడ్ కనిపించగానే అది సరైనదో కాదో తెలియకుండా స్కాన్ చేయకూడదు. అవతలి వ్యక్తి పేరు స్క్రీన్‌పై చూసుకున్న తర్వాతే డబ్బులు పంపాలి.
- చాలామంది మోసగాళ్లు డబ్బులు పంపిస్తామని ఆశ చూపి.. 'కలెక్ట్ రిక్వెస్ట్' పంపుతారు. డబ్బులు అందుకునేందుకు ఎప్పుడూ యూపీఐ పిన్ నంబరును నమోదు చేయాల్సిన అవసరం లేదు. పంపించేందుకు మాత్రమే యూపీఐ పిన్ వాడతామనే విషయాన్ని గుర్తుంచుకోవాలి.




# రిజర్వ్ బెంచ్‌ను పరీక్షించండి

**ఇర్ఫాన్ పఠాన్**

వన్డే ప్రపంచ కప్ 2027కు సరిగ్గా ఏడాది సమయం ఉంది. ఈలోగా తక్కువ వన్డే సిరీస్‌లను మాత్రమే భారత్ ఆడనుంది. అందుకే, ప్రతి మ్యాచ్‌ను ఓ పరీక్షగానే భావించాలని టీమ్‌ఇండియా మాజీ ఆటగాడు ఇర్ఫాన్ పఠాన్ సూచించాడు. ఇటువైపు మేనేజ్‌మెంట్ కూడా అలానే తీసుకోవాలన్నాడు. సెప్టెంబర్ 27 నుంచి విండీస్‌తో మూడు వన్డేల సిరీస్‌ను భారత్ ఆడనుంది. ఈ సిరీస్‌లో భారత రిజర్వ్ బెంచ్‌ను పరీక్షించాలని ఇర్ఫాన్ తెలిపాడు. "విండీస్‌తో వన్డే సిరీస్‌లో నాకు ఒకే ఒక్క ప్లేయర్ ఆటను వీక్షించాలని ఉంది. అదీనూ అతడికి ఎన్ని మ్యాచుల్లో ఆడే అవకాశం వస్తుందో చూడాలి. అతడే యశస్వి జైస్వాల్. ఈ కుర్రాడిని బ్యాకప్ ఓపెనర్‌గా మేనేజ్‌మెంట్ తీసుకుంది. మరి ఇలాంటి ఆటగాడికీ వచ్చే ఏడాది వరల్డ్ కప్ వెళ్లేనాటికి సరైన అవకాశాలు ఇవ్వాల్సిన అవసరమూ ఉంది. ఎప్పుడు అవకాశం ఉన్నా ఆడించేందుకు ప్రయత్నించాలి. అదెలా చేస్తారనేది మేనేజ్‌మెంట్ పర్యవేక్షించాలి. బ్యాటింగ్ ఆర్డర్ మారుస్తారా? ప్లేయర్లను రొటేట్ చేస్తారా? అనేది మీ ఇష్టం. ఇప్పుడీ విండీస్ సిరీస్‌లో ఒక్క అవకాశమైనా ఇస్తే బాగుంటుందనేది నా అభిప్రాయం" అని ఇర్ఫాన్ వెల్లడించాడు. "ఇప్పుడు వెస్టిండీస్‌తో ఆడే జట్టు పూర్తిస్థాయి ప్రధాన జట్టు కాదు. రిజర్వ్ బెంచ్‌ను పరీక్షించేందుకు ఇదే సరైన సమయంగా భావిస్తా. బుమ్రా, శ్రేయస్, అక్షర్, సుందర్.. ఇలాంటి ప్లేయర్లు లేరు. వారంతా ఆసియా గేమ్స్ కోసం వెళ్లారు. వచ్చే వరల్డ్ కప్‌నాటికి కొన్ని మ్యాచులు మాత్రమే ఉంటాయి. అందుకే, బెంచ్‌పై ఉన్న ప్లేయర్లను ఆడించాలి. ఒకేసారి ఆసియా గేమ్స్, వెస్టిండీస్ సిరీస్‌లు రావడం వరంలా భావించాలి. కుర్రాళ్లకు ఛాన్స్ ఇవ్వండి" అని ఇర్ఫాన్ సూచించాడు.




# అద్భుతమైన టాలెంట్ వైభవ్ సొంతం : జయసూర్య

క్రికెట్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీపై శ్రీలంక క్రికెట్ దిగ్గజం జయసూర్య ప్రశంసల వర్షం కురిపించాడు. అతడిలో ప్రత్యేక ప్రతిభ ఉందని.. భారత క్రికెట్ భవిష్యత్‌గా ఎదుగుతాడని కొనియాడాడు. అయితే, తొందరపడి టీమ్‌ఇండియాలోకి తీసుకోవద్దని సలహా ఇచ్చాడు. అతడికి ఇంకా చాలా సమయం ఉందని, ఈలోగా నైపుణ్యాలకు మరింత సానపట్టుకునేందుకు అవకాశం ఉంటుందని చెప్పాడు. గురుగ్రామ్‌లో నిర్వహించిన కార్పొరేట్ వరల్డ్ కప్ ప్రారంభోత్సవ వేడుకలకు హాజరైన జయసూర్య జాతీయ మీడియాతో మాట్లాడాడు. "వైభవ్ సూర్యవంశీలో అద్భుత ప్రతిభ ఉంది. అవకాశాలు కూడా వెతుక్కుంటూ వస్తాయి. అతడికి మంచి భవిష్యత్ ఉంది. అయితే, వైభవ్ ఏ స్థానంలో ఆడగలడో కచ్చితంగా చెప్పలేను. అతడి ఎంపిక.. బ్యాటింగ్ లైనప్ గురించి కామెంట్ చేయదలచుకోలేదు" అని జయసూర్య అన్నాడు. ఇటీవల అఫ్గానిస్థాన్‌తో జరిగిన టీ20 సిరీస్ జట్టులో సూర్యవంశీ ఉన్నాడు. అయితే.. రెగ్యులర్ ఓపెనర్లుగా సంజూ శాంసన్, అభిషేక్ శర్మనే బరిలోకి దిగారు. వారిద్దరూ ఇంకా రాణించాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డాడు. "ఒక్కో క్రికెటర్‌కు ఒక్కో టాలెంట్ ఉంటుంది. భారత్‌లో కాంపిటిషన్ కూడా ఎక్కువే. టీమ్ ఇండియా అన్ని ఫార్మాట్లలోనూ బరిలో నిలుస్తోంది. ఒక ఆటగాడు అన్ని ఫార్మాట్లలోనూ ఆడటం అంత సులువేం కాదు. దేశం తరఫున ఆడాలన్న తపన ఇక్కడి క్రీడాకారుల్లో ఎక్కువ. దేశానికి ప్రాతినిధ్యం వహించేందుకు శక్తికి మించి కష్టపడుతుంటారు." అని జయసూర్య అన్నాడు. క్రీడారంగంలో కార్పొరేట్ సంస్థల ఉనికికి పెరుగుతున్న ప్రాముఖ్యతను, కార్పొరేట్ క్రికెట్ ప్రపంచకప్ ఆవశ్యకతను ఈ సందర్భంగా ప్రస్తావించాడు. ఐపీఎల్‌లో ఆడేందుకు అవకాశం దొరకని చాలా మంది క్రీడాకారులకు ఇదో చక్కని అవకాశమన్నాడు. భారత క్రికెట్‌కు కూడా కార్పొరేట్ వరల్డ్‌కప్‌తో ప్రయోజనం ఉంటుందని భావిస్తున్నట్లు చెప్పాడు.

# ఫైనల్‌కు భారత అమ్మాయిలు

### సెమీస్‌లో బంగ్లా చిత్తు..




ఆసియా క్రీడల్లో భారత్‌కు మరో పతకం ఖాయమైంది. క్రికెట్‌లో భారత మహిళా జట్టు ఫైనల్‌కు చేరుకుంది. సెమీస్‌లో బంగ్లాదేశ్‌ను చిత్తు చేసింది. దీంతో శ్రీలంకతో తుది పోరులో తలపడనుంది. మంగళవారం ఫైనల్ జరగనుంది. ఇక కాంస్య పతకం కోసం పాకిస్థాన్ – బంగ్లాదేశ్ తలపడతాయి. టాస్ నెగ్గి తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 195 పరుగులు చేసింది. ఓపెనర్ షఫాలీ వర్మ (100ని: 49 బంతుల్లో 3 ఫోర్లు, 9 సిక్స్‌లు) శతకం బాదేసింది. కెప్టెన్ హర్మన్ ప్రీత్ (40), స్మృతి మంధాన (37) రాణించారు. అనంతరం లక్ష్య ఛేదనలో బంగ్లాదేశ్ 15.4 ఓవర్లలో 81 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ దిలారా అక్తెర్ (27) టాప్ స్కోరర్. భారత బౌలర్లలో దీప్తి శర్మ 3, నందని శర్మ 3, శ్రీ చరణి 2.. క్రాంతి గౌడ్, శ్రేయాంక పాటిల్ తలో వికెట్ తీశారు. ఆసియా కప్ నుంచి మంచి ఫామ్‌లో ఉన్న షఫాలీ వర్మ.. ఇప్పుడు ఆసియా గేమ్స్‌లోనూ అదే జోష్ కొనసాగిస్తోంది. ఇక సెమీస్‌లో బంగ్లా బౌలింగ్‌ను ఊచకోత కోసింది. చివరి ఓవర్ వరకూ క్రీజ్‌లో ఉండిపోయిన ఆమె.. సిక్సర్ల వర్షం కురిపించింది. స్మృతి మంధానతో కలిసి తొలి వికెట్‌కు 72 పరుగుల భాగస్వామ్యం నిర్మించింది. గుణాలన్ కమలిని (3) విఫలమైనా.. హర్మన్‌తో కలిసి షఫాలీ మరింత దూకుడుగా ఆడింది. 94 పరుగులు జోడించింది. ఆఖర్లో రిచా ఘోష్ (9) సిక్స్ కొట్టడంతో భారత్ స్కోరు 190ం దాటేసింది. బంగ్లా బౌలర్లలో మరుఫా, షాన్‌జిదా, రెబయా, నహిదా తలో వికెట్ తీశారు.




# ఆస్ట్రేలియాను వణికించిన జింబాబ్వే

### ఒక్క వికెట్ తేడాతో విజయం

హరారే వేదికగా జింబాబ్వే-ఆస్ట్రేలియా మధ్య జరిగిన మూడో వన్డే అభిమానులను ఆఖరి వరకు మునివేళ్లపై నిలబెట్టింది. చివరి వరకు నువ్వా-నేనా అన్నట్లు సాగిన ఈ ఉత్కంఠ పోరులో ఒక్క వికెట్ తేడాతో ఆస్ట్రేలియా విజయం సాధించింది. 272 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన కంగారూలకు జింబాబ్వే బౌలర్లు చుక్కలు చూపించారు. జోష్ ఇంగ్లిస్ (103) సెంచరీతో కదం తొక్కినప్పటికీ, మిగతా బ్యాటర్లు విఫలం కావడంతో ఆసీస్ కష్టాల్లో పడింది. ఒకానొక దశలో 232 పరుగులకే 8 వికెట్లు కోల్పోవడంతో ఆసీస్‌కు ఓటమి తప్పదని అంతా భావించారు. ఈ సమయంలో 9వ స్థానంలో క్రీజులోకి వచ్చిన పేసర్ నాథన్ ఎల్లిస్ (36 నాటౌట్) బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ ఆడి జట్టును విజయ తీరాలకు చేర్చాడు. చివరి ఓవర్‌లో ఆసీస్ విజయానికి 9 పరుగులు అవసరం కాగా.. ఎల్లిస్ తొలి బంతికే సిక్స్ బాది విజయాన్ని ఖాయం చేశాడు. కాగా 49వ ఓవర్‌లో ఎల్లిస్ ఇచ్చిన క్యాచ్‌ను మధెవెరే జారవిడవడమే జింబాబ్వే ఓటమికి కారణమైంది. జింబాబ్వే బౌలర్లలో బ్రాడ్ ఎవాన్స్ 4 వికెట్లతో రాణించాడు. అంతకు ముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన జింబాబ్వే నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 271 పరుగులు చేసింది. కెప్టెన్ సికందర్ రాజా (81 నాటౌట్), క్రెగ్ ఎర్విన్ (59), ఇన్నోసెంట్ కైయా (55) హాఫ్ సెంచరీలతో మెరిశారు. ఆసీస్ బౌలర్లలో నాథన్ ఎల్లిస్ 3, ఆడమ్ జంపా, స్పెన్సర్ జాన్సన్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. ఈ విజయంతో మూడు వన్డేల సిరీస్‌ను 3–0 తేడాతో క్లీన్ స్వీప్ చేసింది.

# క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లిన సింధు బృందం

జపాన్ వేదికగా జరుగుతున్న ఆసియా గేమ్స్ 2026లో భారత మహిళల బ్యాడ్మింటన్ జట్టు శుభారంభం చేసింది. ఆదివారం జరిగిన రౌండ్ ఆఫ్ 16 (ప్రీక్వార్టర్స్) పోరులో భారత్ 3–0తో కజకిస్థాన్‌ను చిత్తు చేసి క్వార్టర్ ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. ఈ మ్యాచ్‌లో భారత షట్లర్లు పి.వి. సింధు, ఉన్నతి హుడా, తన్వి శర్మలు అద్భుత ప్రదర్శనతో ప్రత్యర్థి జట్టుకు చెమటలు పట్టించారు. వీరి ధాటికి కజకిస్థాన్ ఆటగాళ్లు చేతులెత్తేశారు. మొదటి సింగిల్స్‌లో కామిలా స్మాగులోవాపై 21–7, 21–9 తేడాతో పి.వి. సింధు ఘనవిజయం సాధించింది. అనంతరం రెండో సింగిల్స్‌లో అలెస్సా కులేషోవాను 21–7, 21–10 తేడాతో ఉన్నతి హుడా ఓడించి భారత ఆధిక్యాన్ని 2–0కి పెంచింది. ఇక మూడో సింగిల్స్‌తో దయానా నమేనోవాపై 21–5, 21–10 తేడాతో తన్వి శర్మ విజయం సాధించి 3–0తో క్లీన్ స్వీప్ పూర్తి చేసింది. ఈ భారత త్రయం కేవలం 65 నిమిషాల్లోనే ప్రత్యర్థులను మట్టికరిపించడం విశేషం.



మంగళవారం రోజున క్వార్టర్‌ఫైనల్లో ఆతిథ్య జపాన్ జట్టుతో భారత బృందం తలపడనుంది. మొదటి రౌండ్‌లో 'బై' పొందిన జపాన్, క్వార్టర్స్‌లో భారత జట్టుకు గట్టి పోటీనిచ్చేందుకు సిద్ధంగా ఉంది.



# 'ది ప్యారడైజ్' స్పెషల్ ప్రీమియర్..

## తెలంగాణలో టికెట్ ధరల పెంపు



నాని కథానాయకుడిగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ థ్రిల్లర్ 'ది ప్యారడైజ్'. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ సెప్టెంబరు 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా తెలంగాణలో టికెట్ ధరలను పెంచుకునేందుకు చిత్ర బృందానికి అనుమతి లభించింది. అంతేకాదు, సెప్టెంబరు 23న సాయంత్రం 6.30కు స్పెషల్ ప్రీమియర్ వేసేందుకు కూడా అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. స్పెషల్ ప్రీమియర్ ధరను రూ.500 (జీఎస్టీతో కలిపి)గా నిర్ణయించారు. సింగిల్ స్క్రీన్‌లో సెప్టెంబరు 24 నుంచి 27 వరకూ ప్రస్తుతం ఉన్న టికెట్ ధరకు అదనంగా రూ.48 (జీఎస్టీతో కలిపి); సెప్టెంబరు 28 నుంచి అక్టోబరు 3 వరకూ రూ.23 (జీఎస్టీతో కలిపి).. ఇక మల్టీప్లెక్స్‌లో వరుసగా అదే తేదీల్లో రూ.94, (జీఎస్టీతో కలిపి) రూ.45 (జీఎస్టీతో కలిపి) పెంచుకునేందుకు వెసులుబాటు ఇచ్చారు. రోజుకు ఐదు షోలను ప్రదర్శించేందుకు అనుమతి లభించింది. ఈ సందర్భంగా తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ కమిటీకి చిత్ర నిర్మాణ సంస్థ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సినీమాస్ ఎల్ఎల్‌పీ రూ.కోటి అందజేసింది.

# వరుస ఆఫర్లతో దూసుకుపోతున్న ప్రియాంక మోహన్

కోలీవుడ్ క్యూట్ అండ్ టాలెంటెడ్ బ్యూటీ ప్రియాంక మోహన్ క్రేజ్ ఇప్పుడు పీక్స్‌కి వెళ్లిపోయిందనడంలో అతిశయోక్తి లేదు. ఏ భాషలో చూసినా వరుస ఆఫర్లతో ఈ అమ్మడు దూసుకుపోతున్న తీరు చూసి నెటిజన్లు సైతం షాక్ అవుతున్నారు. ప్రస్తుతం ఆమె చేతిలో 'అరసన్', 'మంజనత్తి', 'కవిన్-9' లాంటి క్రేజీ ప్రాజెక్టులు ఉండగా, తాజాగా టాలీవుడ్ నుంచి మరో అదిరిపోయే బంపర్ ఆఫర్ ఆమె ఖాతాలో చేరినట్లు సోషల్ మీడియాలో పలు పోస్టులు వైరల్ అవుతూ హాట్ టాపిక్‌గా మారాయి. ఇటీవల 'ఇరుముడి'తో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న మాస్ మహారాజా రవితేజ, టాలెంటెడ్ డైరెక్టర్ వివేక్ ఆత్రేయ క్రేజీ కాంబినేషన్‌లో రాబోతున్న భారీ చిత్రంలో ప్రియాంక మోహన్ హీరోయిన్‌గా ఫిక్స్ అయినట్లు సమాచారం. భారీ విజయంతో ఫుల్ జోష్‌లో ఉన్న రవితేజ సరసన ఈ బ్యూటీ జోడీ కడుతుండటం విశేషం. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్ పనులు శరవేగంగా జరుగుతున్నట్లు తెలుస్తోంది. అయితే వచ్చే అక్టోబర్‌లో దసరా పండుగ కానుకగా ఈ మూవీని అఫీషియల్‌గా పట్టాలెక్కించాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట. లక్ష్మణ్ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని, వచ్చే ఏడాది సమ్మర్ స్పెషల్‌గా థియేటర్లలోకి తీసుకురావడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. రవితేజ - వివేక్ ఆత్రేయ కాంబోకి ప్రియాంక మోహన్ గ్లామర్ తోడవడంతో, ఈ సినిమాపై అప్పుడే భారీ అంచనాలు క్రియేట్ అయిపోయాయి.



# డిసెంబరు బరిలో 'అలియాస్ రుక్మిణీ'

కథానాయకుడు నితిన్ ప్రస్తుతం 'అలియాస్ రుక్మిణీ' చిత్రంతో సెట్స్‌పై బిజీగా ఉన్నారు. నాని సమర్పణలో యునానిమస్ ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మిస్తున్న ఈ సినిమాని 'దండోరా' ఫేమ్ మురళీకాంత్ దేవాసోత్ తెరకెక్కిస్తున్నారు. సాయికుమార్, హర్ష వర్ధన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇటీవలే చిత్రీకరణ ప్రారంభించుకున్న ఈ చిత్రాన్ని డిసెంబరులో తెరపైకి తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. దీనికి తగ్గట్లే ప్రస్తుతం షూట్‌ని చకచకా పరుగులు పెట్టిస్తున్నట్లు తెలిసింది. ఇది అందర్నీ మెప్పించే ఆసక్తికర కథతో ఓ విలక్షణమైన ప్రపంచాన్ని ఆవిష్కరించేలా ఉంటుందని.. ఇందులో నితిన్ ఓ వినూత్నమైన పాత్రలో అలరిస్తారని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. ఈ సినిమాకి సంగీతం: విజయ్ బుల్గానిన్, ఛాయాగ్రహణం: జోమోన్ టీ జాన్.

# కత్రినాపై ట్రోలింగ్..

## నెటిజన్లపై సల్మాన్ ఖాన్ ఫైర్

ప్రసవానంతరం బరువు పెరిగిన బాలీవుడ్ నటి కత్రినా కైఫ్‌పై సోషల్ మీడియాలో జరుగుతున్న ట్రోలింగ్‌ను స్టార్ హీరో సల్మాన్ ఖాన్ తీవ్రంగా ఖండించారు. 'బిగ్ బాస్-20'లోని ఓ ఎపిసోడ్‌లో ఆయన ఈ విషయంపై స్పందిస్తూ.. ఇతరులను కించపరిచే ట్రోలర్స్‌పై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. "గర్భం దాల్చిన తర్వాత బరువు పెరగడం అనేది ఎవరికైనా చాలా సహజం. ఒక మహిళను బరువు గురించి ట్రోల్ చేయడం సరికాదు. కత్రినా ప్రస్తుతం తన కుటుంబంతో సమయం గడపాలనుకుంటోంది. ఆమె మళ్లీ షూటింగ్స్‌లో పాల్గొనే సమయానికి కచ్చితంగా మునుపటి ఆకృతిలోకి వస్తుంది. ఇలాంటి ట్రోల్స్‌ను ఆమె అస్సలు పట్టించుకోకూడదు" అని సల్మాన్ అసహనం వ్యక్తం చేశారు. "సోషల్ మీడియా ద్వారా నేడు చాలా మంది ఉపాధి పొందుతున్నారు. కానీ, కొందరు మాత్రం ఇతరులను కించపరుస్తూ డబ్బులు సంపాదిస్తున్నారు. వాళ్ల నిజమైన ముఖాలు, గుర్తింపును బయటపెట్టుకోలేరు కానీ.. ఎదుటివారి వయసు, బరువు, అందంపై విమర్శలు చేస్తారు. ఇతరుల వైఫల్యాలను చూసి ఆనందించే వారు చాలా మందే ఉన్నారు. నన్ను కూడా ముసలోడిని అయిపోయానని ట్రోల్ చేస్తుంటారు. అవును.. నాకు 60 ఏళ్లు. నేను ఎప్పటికీ 'మైనే ప్యార్ కియా' నాటి కుర్రాడిలాగే కనిపించలేను కదా? వయసు పెరగడం అనేది చాలా సాధారణ విషయం. కానీ, దాన్నేదో పెద్ద నేరంలా చూస్తూ విమర్శించడం సరికాదు" అని సల్మాన్ పేర్కొన్నారు. ఇదే ఎపిసోడ్‌కు సంబంధించిన మరో ప్రోమో అభిమానులను ఆందోళనకు గురిచేసింది. వేదికపై మాట్లాడుతున్న సల్మాన్.. అకస్మాత్తుగా ఛాతీ పట్టుకుని కుప్పకూలిపోయారు. అయితే, అదంతా కేవలం ఓ కంటెస్టెంట్‌కు బుద్ధి చెప్పేందుకు చేసిన ప్రాంక్ మాత్రమేనని సల్మాన్ సోషల్ మీడియా ద్వారా క్లారిటీ ఇచ్చారు. హౌస్‌లో ఉన్న ఓ కంటెస్టెంట్.. తనకు అనారోగ్యంగా ఉందని, 'మల్టిపుల్ పర్సనాలిటీ డిజార్డర్' ఉందని మిగతావారితో అబద్ధం చెప్పారు. ఆరోగ్యపరమైన విషయాలతో సరదాగా ఆడుకుంటే ఎదుటివారు ఎంతలా కంగారు పడతారో అతడికి ప్రాక్టికల్‌గా అర్థమయ్యేలా చెప్పడానికే సల్మాన్ ఇలా చేశారట. కాబట్టి అభిమానులు ఎవరూ ఆందోళన చెందొద్దని సల్మాన్ స్పష్టం చేశారు.







# పురుషులకు అప్పుడే ఆ బాధ తెలుస్తుంది: శ్రుతి హాసన్

కోలీవుడ్ స్టార్ హీరోయిన్ శృతి హాసన్ వరుస సినిమాలతో దూసుకుపోతున్నారు. విజయ్ సేతుపతితో కలిసి 'ట్రెయిన్', దుల్కర్ సల్మాన్ హీరోగా తెరకెక్కుతున్న 'ఆకాశంలో ఒక తార' సినిమాలలో నటిస్తూ బిజీగా ఉన్నారు. ఓ వైపు నటిగా రాణిస్తూనే.. సింగర్‌గా కూడా పలు చిత్రాల్లో పాటలు పాడుతున్నారు. దర్శక ధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కిస్తున్న భారీ చిత్రం 'వారణాసి'లోనూ ఆమె ఒక పాటకు తన మధురమైన స్వరాన్ని అందించారు. సినిమాలతో ఎంత బిజీగా ఉన్నప్పటికీ శృతి హాసన్ పలు ఇంటర్వ్యూలో పాల్గొంటున్నారు. తాజాగా, సోహా అలీ ఖాన్ నిర్వహించిన ఒక ప్రత్యేక పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న శృతి హాసన్.. పీరియడ్స్ సమయంలో వచ్చే తీవ్రమైన నొప్పులు, వాటి గురించి సమాజంలో ఉండే అపోహలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనకు పీసీఓఎస్ (పాలీసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్) సమస్య ఉందని, దీని కారణంగా పీరియడ్స్ సమయంలో తాను చాలా బాధను అనుభవిస్తానని తెలిపారు. తన సినీ కెరీర్ ఆరంభంలో ఈ విషయాల గురించి మాట్లాడేందుకు తాను కొంచెం మొహమాట పడేదానినని, దీని గురించి ఎవరూ పెద్దగా చర్చించరని భావించానని శృతి చెప్పారు. కానీ తోటి నటులు తమ మోకాలి సర్జరీ వంటి సమస్యల గురించి చెప్పినప్పుడు డైరెక్టర్లు సెట్స్‌లో సర్దుబాటు చేసేవారని, తాను మాత్రం పీరియడ్స్ గురించి చెప్పడానికి సంకోచించేదానినని తెలిపారు. మగవాళ్లకు కూడా పీరియడ్స్ వస్తే బాగుంటుందని, అప్పుడు ఆటోమేటిక్‌గా వర్క్ కాంట్రాక్ట్స్‌లో పీరియడ్ సెలవులు కూడా వచ్చి ఉండేవి కదా అని తాను అనుకున్నట్లు వెల్లడించారు. అంతేకాకుండా పురుషులకు కూడా నెలసరి రావాలని అప్పుడే మహిళలు పడే బాధ వాళ్లకు తెలుస్తుందని.. తాను దాదాపు 1000సార్లు దేవుడిని ప్రార్థించానని చెప్పారు. అయితే ఒకసారి తాను పీరియడ్ విషయం చెప్పినప్పుడు, ఆ దర్శకుడికి కూతురు ఉండటంతో ఆ కష్టాన్ని అర్థం చేసుకుని తనకు పూర్తి సహకారం అందించారని, ఆ సంఘటన తర్వాతే తన ఆలోచనా విధానంలో మార్పు వచ్చిందని ఆమె వివరించారు.

PUBLISHED AND OWNED BY DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJ-GIRI, TELANGANA - 500083..EDITOR : DUSARI RAVINDER GOUD, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com